# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 4-2-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 158 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## ముచ్చింతల్ చేరుకున్న సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 2:తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్ కు చేరుకున్నారు.

అక్కడ నిన్నటి నుంచి భగవద్రామానుజల సహస్రాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. శ్రీ రామానుజాచార్యలు 216 అడుగుల విగ్రహం స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ ఆవిష్కరణకు సన్నాహాలు పూర్తయ్యాయి. ముచ్చింతల్ గ్రామంలోని చిన్నజీయర్ స్వామి ఆశ్రమంలోని 40 ఎకరాల సువిశాల ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరుగుతోంది. ఈ కార్యక్రమానికి వెళ్లిన సీఎం కేసీఆర్ శ్రీ రామానుజాచార్యలు విగ్రహాన్ని సందర్శించి.. చిన్నజీయర్ స్వామి ఆశీర్వాదం తీసుకోనున్నారు. అనంతరం తిరిగి ప్రగతి భవన్ కు చేరుకుంటారు. ఇక సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## ఈనెల 5న హైదరాబాద్‌ను సందర్శించనున్న ప్రధాన మంత్రి

హైదరాబాద్, ఫిబ్రవరి 3:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్రమోదీ ఫిబ్రవరి 5వ తేదీ నాడు హైదరాబాద్ ను సందర్శించనున్నారు. ఆ రోజు న మధ్యాహ్నం పూట సుమారు 2 గంటల 45 నిమిషాల వేళ కు, ప్రధాన మంత్రి హైదరాబాద్ లోని పటాన్ చెరు లో మెట్ట ప్రాంత పంట ల సంబంధి అంతర్జాతీయ పరిశోధన సంస్థ (ఇంటర్ నేశనల్ క్రాప్స్ రిసర్చ్ ఇన్స్ టిట్యూట్ ఫార్ ది సెమి-ఎరిడ్ ట్రాపిక్స్.. ఐసిఆర్ఐఎస్ఎటి-'ఇక్రిశాట్') ఆవరణ ను సందర్శించి, ఇక్రిశాట్ 50వ వార్షికోత్సవాల ను ప్రారంభిస్తారు.

అదే రోజు న సాయంత్రం పూట ఇంచుమించు 5 గంటల వేళ కు, ప్రధాన మంత్రి హైదరాబాద్ లోని 'స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ' ని దేశ ప్రజల కు అంకితం చేస్తారు.

11వ శతాబ్ది కి చెందినటువంటి భక్తి ప్రబోధక ముని శ్రీ రామానుజాచార్య ను స్మరించుకొనేందుకు 216 అడుగుల ఎత్తయినటువంటి 'సమతా విగ్రహం' ని ('స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ') ఏర్పాటు చేయడమైంది. శ్రీ రామానుజల వారు ధర్మం, కులం, వర్గం లు సహా జీవనం లోని అన్ని అంశాల లోనూ సమానత్వం అనే ఉద్దేశ్యాన్ని ప్రోత్సహించారు. సమతా విగ్రహాన్ని బంగారం, వెండి, రాగి, ఇత్తడి, ఇంకా జింకు అనే అయిదు లోహాల కలయిక.. అదే.. 'పంచలోహం' తో రూపొందించడం జరిగింది. ఈ విగ్రహాన్ని కూర్చొన్న భంగిమ లో ప్రపంచం లో ఏర్పాటైన అతి ఎత్తయిన లోహ విగ్రహాలన్నిటిలోకీ ఒక విగ్రహం గా పేర్కొనవలసివుంది. 'భద్ర వేది' పేరు తో గల 54 అడుగుల ఎత్తయిన ఆధార భవనం మీద శ్రీ రామానుజాచార్య విగ్రహాన్ని అమర్చారు. దీని లో ఒక వైదిక డిజిటల్ గ్రంథాలయం మరియు పరిశోధన కేంద్రం, భారతీయ పురాతన మూలగ్రంథాలు, ఒక రంగస్థలం, వీటికి తోడు గా శ్రీ రామానుజాచార్య లిఖించిన అనేక రచనల ను కళ్ల కు కట్టే ఒక విద్యా ప్రదర్శన శాల.. వీటన్నిటికై ప్రత్యేకించిన అంతస్తు లు కూడాను ఏర్పాటు చేయడం జరిగింది. శ్రీ రామానుజాచార్య ఆశ్రమానికి చెందిన శ్రీ చిన్న జీయర్ స్వామి ఆలోచన ల ప్రకారం సమతా విగ్రహాన్ని రూపుదిద్దడమైంది.

ఈ కార్యక్రమం లో భాగం గా, రామానుజాచార్య జీవన యానానికి మరియు ఆయన బోధనల కు సంబంధించిన 3డి ప్రజెంటేశన్ మేపింగ్ ను కూడా ప్రదర్శించడం జరుగుతుంది. 108 దివ్య దేశాల (అందంగా చెక్కిన ఆలయాల) ను పోలివుండే పునర్ నిర్మిత ఆకృతుల ను సమతా విగ్రహం (స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ) చుట్టూరా ఏర్పాటు చేశారు. ప్రధాన మంత్రి ఆ నిర్మాణాల ను సైతం సందర్శించనున్నారు.

ప్రతి మనిషి ని ఆ వ్యక్తి ది ఏ దేశం , ఏ లింగం, ఏ జాతి, ఏ కులం, ఏ వర్గం అనేవి ఏవీ చూడకుండా మనుషులంతా సమానులే అనే భావన తో ఎంచుతూ, ప్రజల అభ్యున్నతి కోసం శ్రీ రామానుజాచార్య అవిశ్రాంతం గా పాటుపడ్డారు. ఈ సమతా విగ్రహ ఆవిష్కరణ అనేది ప్రస్తుతం కొనసాగుతున్నటువంటి శ్రీ రామానుజాచార్య యొక్క 1000వ జయంతి ఉత్సవాల లో ఒక భాగం గా 'శ్రీ రామానుజాచార్య సహస్రాబ్ది సమారోహం' పేరు తో ఏర్పాటు చేసిన కార్యక్రమమే.

ప్రధాన మంత్రి తన పర్యటన లో భాగం గా, ఇక్రిశాట్ 50వ వార్షికోత్సవాల ను అంత క్రితం ప్రారంభించనున్నారు. ఇక్రిశాట్ కు చెందిన సస్య రక్షణ సంబంధి జలవాయు పరివర్తన ప్రధానమైన పరిశోధన సదుపాయాన్ని మరియు రాపిడ్ జనరేశన్ అడ్వాన్స్ మెంట్ ఫెసిలిటీ ని కూడా ప్రధాన మంత్రి ప్రారంభిస్తారు. ఈ రెండు సదుపాయాలు ప్రధానం గా ఆసియా కు, ఇంకా సబ్- సహారాన్ ఆఫ్రికా కు చెందిన చిన్న కమతాలు కలిగివున్న రైతుల కోసం ఏర్పాటు అయినటువంటి సదుపాయాలు. ఇక్రిశాట్ తాలూకు ప్రత్యేకంగా రూపుదిద్దిన ఒక అధికార చిహ్నం (లోగో) ను కూడా ప్రధాన మంత్రి ఆవిష్కరిస్తారు. అలాగే ఈ సందర్భం లో జారీ చేసేందుకు ఉద్దేశించిన ఒక స్మారక తపాలా బిళ్ల ను ఆయన ప్రవేశపెడతారు.

ఇక్రిశాట్ అనేది ఒక అంతర్జాతీయ సంస్థ. ఈ సంస్థ ఆసియా లో మరియు సబ్- సహారాన్ ఆఫ్రికా లో అభివృద్ధిపరచడం కోసం ఉద్దేశించినటువంటి వ్యవసాయ సంబంధి పరిశోధనల ను నిర్వహిస్తూ ఉంటుంది. మెరుగుపరచినటువంటి పంటల రకాల ను మరియు హైబ్రిడ్ లను సమకూర్చడం ద్వారా రైతుల కు ఈ సంస్థ సహాయకారి గా ఉంటున్నది. అంతేకాకుండా మెట్టభూముల లో జలవాయు పరివర్తన కు వ్యతిరేకంగా పోరాడడం లో చిన్న కమతాల రైతుల కు తోడ్పడుతున్నది.

## దేశంలోని అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తోన్న బిజెపి - మంత్రి తలసాని

హైదరాబాద్, ఫిబ్రవరి 2: ఇప్పటి వరకు రాజ్యాంగ సవరణే జరగలేదన్నట్లు బిజెపి, కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. దేశంలో నరేంద్రమోడీ రాజ్యాంగం నడుస్తుందన్నారు. దేశంలోని అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీలకు బడ్జెట్ లో ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. గ్రామీణ అభివృద్ధి నిధులకు కూడా కోత విధించిందని విమర్శించారు. దేశంలో 40కోట్ల జనాభా ఉన్న దళిత, గిరిజనులకు బడ్జెట్ లో సరైన నిధులు కేటాయించలేదని విమర్శించారు. తెలంగాణకు బడ్జెట్ లో ఎందుకు నిధులు కేటాయించడం లేదని , తెలంగాణ ..భారతదేశంలో లేదా అని నిలదీశారు. ప్రజలకు మేలు జరగాల్సిన వాటి కోసం రాజ్యాంగసవరణ జరగాలి. బీజేపీ మతాలను రెచ్చగొట్టడం తప్పితే.. చేసిందేం లేదని అన్నారు.

## మేడ్చల్‌లో మరో 50 పడకల ఆసుపత్రి : మంత్రి హరీష్ రావు



మేడ్చల్, ఫిబ్రవరి 3: మేడ్చల్ మున్సిపల్ పట్టణంలో మార్చి బడ్జెట్ లో నిధులు కేటాయించి అదనంగా మరో 50 పడకల ఆసుపత్రి ఆసుపత్రిని ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు హామీ ఇచ్చారు. గురువారం మేడ్చల్ మున్సిపల్ పట్టణంలో మేడినోవా మల్టీ స్పెషాలిటీ ప్రైవేటు ఆసుపత్రి ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మేడ్చల్ మున్సిపల్ పట్టణంలో ప్రస్తుతం కొనసాగుతున్న 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రితో పాటు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి కోరిక మేరకు రూ.10 కోట్లతో ఏప్రిల్ నెలలో అదనంగా మరో 50 పడకల ఎంసిహెచ్ ఆసుపత్రిని ఏర్పాటు చేసి దానికి సరిపడ సిబ్బందిని నియమిస్తామని మంత్రి హరీష్ రావు వెల్లడించారు. అంతేకాకుండా మాతాశిశు సంక్షేమ ఆసుపత్రి అనుబంధానికి చిన్న పిల్లల వైద్యం కోసం మరో 1 కోటి రూపాయల నిధులతో వార్డును ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ మర్రి దీపికా నరసింహారెడ్డి, తెరాస పార్టీ ఎమ్మెల్యేలు వివేక్, అరేకలపూడి గాంధీ, పద్మ దేవేందర్ రెడ్డి, జడ్పీటీసీ శైలజా విజేందర్ రెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్, స్థానిక మున్సిపల్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల్లో ఆన్‌లైన్ బోధన కూడా: హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 3: తెలంగాణలో విద్యా సంస్థలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. మరోవైపు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలను జారీ చేసింది. ఈ నెల 20వ తేదీ వరకు ఆన్ లైన్లో కూడా విద్యా బోధనను కొనసాగించాలని ఆదేశించింది. ప్రత్యక్ష తరగతులతో పాటు, ఆన్ లైన్ క్లాసులు కూడా కొనసాగాలని తెలిపింది. కరోనా ప్రభావం ఇంకా ఉన్న నేపథ్యంలో హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది.

అంతేకాదు, బార్లు, రెస్టారెంట్లు, మార్కెట్ల వద్ద కూడా కరోనా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. సమ్మక్క, సారక్క జాతరలో కూడా కరోనా వ్యాప్తి నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. రెండు వారాల్లో సమగ్ర నివేదికను ఇవ్వాలని ఆదేశించింది. తరువరి విచారణను ఈ నెల 20కి వాయిదా వేసింది.

## 18 వేల కోట్లతో పేదల కోసం డబుల్ బెడ్రూం ఇళ్లు: మంత్రి కేటీఆర్



హైదరాబాద్, ఫిబ్రవరి 3: హైదరాబాద్ లోని ఖైరతాబాద్, ఇందిరానగర్‌లో డబుల్ బెడ్రూం పథకం కింద నిర్మించిన ఇళ్లను తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి కేటీఆర్ ప్రారంభించారు.

అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. మెయిన్ సెంటర్ పాయింట్‌లో ఈ ఇళ్లు కట్టామని, మార్కెట్‌లో ఒక్కో ఇంటి విలువ 50 లక్షల రూపాయలు ఉంటుందని, వాటిని తాము పేదలకు ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు.

రూ.9,714 కోట్లతో హైదరాబాద్‌లో పేదల కోసం డబుల్ బెడ్రూం ఇళ్లు కడుతున్నామని చెప్పారు. కొల్లూర్ లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. అక్కడ ఒకే చోట 15,640 డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించామని తెలిపారు. ఇక తెలంగాణలో మొత్తం 18 వేల కోట్ల రూపాయలతో పేదల కోసం డబుల్ బెడ్రూం ఇళ్లు కడుతున్నామని చెప్పారు.దేశంలో ఎక్కడా ఇలాంటి ఇళ్లను నిర్మించడం లేదని ఆయన అన్నారు. పేదల కోసం ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఫంక్షన్ హాల్ కోసం రూ.100 కోట్ల విలువచేసే స్థలం కేటాయించామని ఆయన తెలిపారు. కాగా, ఖైరతాబాద్‌లోని ఇందిరానగర్‌లో డబుల్ బెడ్రూం ఇళ్లను ఐదు అంతస్తుల్లో 5 బ్లాకలలో నిర్మించారు. ఇందులో సీసీ రోడ్డు, తాగునీరు, 7 లిఫ్టులు, 7 షాపులు, డ్రైనేజీ కాలువ వంటి అన్ని మౌలిక వసతులు కల్పించారు.

## బీజేపీది ఫేక్ వాట్సప్ ప్రచారం: మంత్రి హరీష్‌రావు



హైదరాబాద్, ఫిబ్రవరి 3:రాష్ట్రంలో, దేశంలో బీజేపీ ఫేక్ వాట్సప్ ప్రచారం చేస్తోందని, దాని తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని హరీష్‌రావు అన్నారు. ఏ అంశంలో చూసినా తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో ఉందన్నారు. బీజేపీ నేతలు మాత్రం అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆయన ఆరోపించారు. ఇక్కడి బండి, గుండు మాటలు చెప్పమంటే కోటలు దాటుతాయని ఆయన ఎద్దేవా చేశారు. తాము అడ్డుకుంటే ఒక్కరు కూడా బయట తిరగలేరని ఆయన మండిపడ్డారు. రాజ్యాంగం గురించి సీఎం కేసీఆర్ ఏం తప్పు మాట్లాడారని ఆయన నిలదీశారు. తాను రాసిన రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని, అవసరమైతే రద్దు చేయాలని అంబేద్కరే చెప్పారని ఆయన పేర్కొన్నారు. ముల్లును ముల్లుతోనే తీయాలని, తప్పుడు ప్రచారాన్ని సోషల్ మీడియా వేదికగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

## చినజీయర్ ఆశ్రమంలో కేసీఆర్ -రామానుజుల విగ్రహాన్ని సందర్శించిన సీఎం

హైదరాబాద్, ఫిబ్రవరి 3:చినజీయర్ ఆశ్రమానికి సీఎం కేసీఆర్ విచ్చేశారు. ఈ సందర్భంగా శ్రీరామనగరాన్ని పరిశీలించారు కేసీఆర్. రామానుజుల విగ్రహాన్ని సందర్శించారు. సహస్రాబ్ది సమారోహం వేడుకలో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. ఘనంగా స్వాగతం పలికారు రుత్వికులు. సీఎంతో పాటు చినజీయర్ స్వామి, మైహోమ్ అధినేత రామేశ్వరరావు ఉన్నారు. నడుచుకుంటూ సెక్యూరిటీ సెంటర్ కి వెళ్లారు కేసీఆర్. ముచ్చింతల్ లో కేసీఆర్ సందడి చేశారు.

## సింగరేణి సంస్థ మూసివేతకు బీజేపీ ప్రభుత్వం కుట్రలు

హైదరాబాద్, ఫిబ్రవరి 3: కేంద్ర ప్రభుత్వంపై టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. తెలంగాణకు గర్వకారణంగా ఉన్న సింగరేణి సంస్థ మూసివేతకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. సింగరేణి బొగ్గు గని కార్మికులు వారి స్వేదంతో దక్షిణ భారతానికి వెలుగులు పంచుతున్నారని చెప్పారు.

సింగరేణిలో రాష్ట్రానికి 51 శాతం, కేంద్రానికి 49 శాతం వాటా ఉందని? అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం తన అధికారాలను తప్పుడు రీతిలో ఉపయోగిస్తోందని మండిపడ్డారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా బీజేపీ వ్యవహరిస్తోందని విమర్శించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో సింగరేణి సంస్థ అద్భుతమైన పురోగతిని సాధించిందని? దేశంలోని ఇతర సంస్థల కంటే ఎక్కువ లాభాలను సాధించిందని చెప్పారు. సింగరేణి ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కేంద్రానికి కేసీఆర్ ఎన్నోసార్లు విన్నవించారని అయితే కేంద్రం నిరంకుశంగా ముందుకు సాగుతోందని అన్నారు.

## ప్రధాని మోదీ పర్యటన బందోబస్తుపై సీఎస్ సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 3:ఈ నెల 5వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ ముచ్చింతల్, ఇక్రిసాట్ లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ బీఆర్కే భవన్‌లో సమావేశమై సమీక్షించారు. ప్రధాని పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ప్రధాని మోదీ పాల్గొనే వేదికల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లతో పాటు, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తును బ్లూ బుక్ ప్రకారం ఏర్పాటు చేయాలని ఆయన పోలీసు శాఖను ఆదేశించారు. వేదికల వద్ద తగు వైద్య శిబిరాలతోపాటు, నిపుణులైన వైద్య బృందాలను ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖను ఆదేశించారు. వీవీఐపీ సందర్శన సమయంలో కోవిడ్-19 ప్రోటోకాల్ పాటించేలా చూడాలని వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శిని సీఎస్ ఆదేశించారు. వీవీఐపీ పాస్ హోల్డర్లకు షెడ్యూల్ చేసిన ప్రోగ్రామ్‌కు ముందే ఆర్టీపీసీఆర్ పరీక్షలను చేపట్టాలని, కోవిడ్-19 స్క్రీనింగ్ బృందాలను పెద్ద సంఖ్యలో సన్నద్ధం చేయాలని సీఎస్ సూచించారు.

రహదారుల మరమ్మతులు.. లైటింగ్ ఏర్పాట్లు..

ప్రధానమంత్రి కాన్వాయ్ ప్రయాణించే రహదారుల మరమ్మతు పనులు చేపట్టాలని, లైటింగ్ ఏర్పాట్లు చేయాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. వీఐపీ సందర్శించే అన్ని ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఇంధన శాఖ అధికారులను ఆదేశించారు. శంషాబాద్ విమానాశ్రయం, ముచ్చింతల్, ఇక్రిసాట్ వద్ద ఏర్పాట్లను కార్యక్రమాల నిర్వాహకులతో సమన్వయం చేయాలని రంగారెడ్డి, సంగారెడ్డి కలెక్టర్లను ఆదేశించారు.

ఈ సమావేశంలో డీజీపీ మహేందర్ రెడ్డి, ఇంధన, హౌసింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, జీఏడీ ముఖ్యకార్యదర్శి వికాస్ రాజ్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శ ఎస్.ఏ.ఎం రిజ్వీ, రవాణా, రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాసరాజు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్, మెదక్ జిల్లా కలెక్టర్ హరీశ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బీజేపీది గాడ్సే ఇజం అయితే టీఆర్ఎస్‌ది అంబేద్కర్ ఇజం: పీయూసీ చైర్మన్ జీవన్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 3: దేశంలో బీజేపీది గాడ్సే ఇజం అయితే టీఆర్ఎస్‌ది అంబేద్కర్ ఇజమని పీయూసీ చైర్మన్ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. ఇంతపెద్ద దేశంలో దళితుల కోసం కేవలం 12వేల కోట్లను కేంద్ర బడ్జెట్‌లో పెడతారా అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా దళితులపై బీజేపీకి ఉన్న ప్రేమా అని ఆయన ప్రశ్నించారు. ఎంపీలు రేవంత్ రెడ్డి, బండి సంజయ్ గల్లీలో కొట్లాడుతారని, ఢిల్లీలో దోస్తాన్ చేస్తారని ఆయన ఆరోపించారు. అంబేద్కర్‌ను అవమానించిన బీజేపీకి రాజ్యాంగం గురించి మాట్లాడే నైతిక హక్కు ఎక్కడిదని ఆయన మండిపడ్డారు. బీమ్ దీక్ష, ఆందోళన దీక్షలు చేస్తామన్న పార్టీలు అంబేద్కర్ ఆశయాలను ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. దళితబంధు, రైతుబంధు లాంటి పథకాలను దేశమంతటా అమలు జరిగే విధంగా రాజ్యాంగం రాసుకుందాం అనే మాటల్లో తప్పేముందన్నారు.

వేముల రోహిత్ ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన వ్యక్తులకు మంత్రి పదవి ఇచ్చింది బీజేపీ కాదా అని ఆయన నిలదీశారు. రాజ్యాంగాన్ని కొత్తగా రాయలన్న కేసీఆర్ వ్యాఖ్యలను తాము సమర్థిస్తున్నామన్నారు. తెలంగాణ అప్పుల గురించి మాట్లాడే బీజేపీ నాయకులు కేంద్రం చేసిన అప్పుల గురించి కూడా మాట్లాడాలని ఆయన హితవు పలికారు. 14మంది ప్రధానులు 56లక్షల కోట్లు అప్పులు చేస్తే, ఒక్క మోడీనే 80లక్షల కోట్ల అప్పులు చేసింది నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగం గురించి సీఎం కేసీఆర్ మాట్లాడిన మాటలు వందశాతం కరెక్ట్ అని ఆయన పేర్కొన్నారు.

## పాక్ మిలటరీ స్థావరాలపై బలూచ్ లిబరేషన్ ఆర్మీ దాడులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:ఉగ్రవాద సంస్థ బలూచ్ లిబరేషన్ ఆర్మీ పాక్‌లోని రెండు మిలటరీ స్థావరాలపై దాడులు చేసింది. ఈ దాడిలో ఓ పాక్ సైనికుడు మరణించాడు. ఇరు వర్గాల మధ్య భీకర కాల్పులు జరిగాయి. ఇక.. ఈ కాల్పుల్లో బలూచ్ లిబరేషన్ ఆర్మీకి చెందిన నలుగురు ఉగ్రవాదులు మరణించారు. అయితే పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ బీజింగ్ పర్యటనకు వెళ్తున్న సందర్భంలోనే ఈ దాడులు జరిగాయి. ఈ దాడులపై పాక్ ప్రధాని ఇమ్రాన్ స్పందించారు. ఉగ్రదాడులను పాక్ సైనికులు వీరోచితంగా తిప్పికొట్టారని, వారికి సెల్యూట్ చేస్తున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. ఇక ఈ దాడులపై బలూచ్ లిబరేషన్ ఆర్మీ కూడా స్పందించింది. ఈ దాడుల్లో 50 మందికి పైగా పాక్ సైనికులు మరణించారని, తామే ఈ దాడులు చేశామని ప్రకటించారు.

## దళితులకు న్యాయం జరగలేదనే కొత్త రాజ్యాంగంపై చర్చ : ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

హైదరాబాద్, ఫిబ్రవరి 3: కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల పాలనలో దళితులకు న్యాయం జరగలేదనే సీఎం కేసీఆర్ కొత్త రాజ్యాంగం చర్చ లేవనెత్తారు అని టీఆర్ఎస్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు పేర్కొన్నారు. టీఆర్ఎస్ఎల్పీలో గువ్వల బాలరాజు మీడియాతో మాట్లాడారు. దమ్ముంటే కేసీఆర్ ప్రతిపాదనపై పార్లమెంట్‌లో చర్చించాలని సవాల్ విసిరారు. అంబేద్కర్‌ను రకరకాలుగా అవమానించిన వారే ఇప్పుడు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా బీజేపీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. దళితులకు మేలు జరగాలంటే కొత్త రాజ్యాంగం అవసరమన్నారు.

కేసీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో ప్రజాకోణంలో పని చేస్తున్నారు. రాజ్యాంగ విలువలు తెలిసిన వ్యక్తి కేసీఆర్ అని బాలరాజు స్పష్టం చేశారు. కేసీఆర్ అన్ని ఆలోచించే మాట్లాడుతారు. అవగాహన లేని వారే కేసీఆర్‌ను విమర్శిస్తారు అని ఆయన ధ్వజమెత్తారు. రాజ్యాంగ విలువలకు లోబడే కేసీఆర్ మాట్లాడారని స్పష్టం చేశారు. కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు దేశవ్యాప్తంగా అమలు కావాలంటే రాజ్యాంగంలో కొన్ని అంశాలు పొందుపరచాలన్నారు. ఇతర దేశాల్లో అవసరాన్ని బట్టి తమ తమ రాజ్యాంగాలను మార్చుకున్నారని గువ్వల బాలరాజు గుర్తు చేశారు. రాజ్యాంగాన్ని మార్చినా అంబేద్కర్ పేరు భూమి ఆకాశాలు ఉన్నంత వరకు సుస్థిరంగా ఉంటుంది అని ఆయన పేర్కొన్నారు. అంబేద్కర్ పేరు రూపుమాపే ఎలాంటి చర్యలను కేసీఆర్ ఆమోదించరు. రాజ్యాంగంలో గట్టి చట్టాలు ఉంటేనే దేశంలో అనుకున్న మార్పు సాధ్యమని కేసీఆర్ గట్టిగా నమ్ముతారు అని గువ్వల బాలరాజు తెలిపారు.

ఈ అంశంపై దేశ వ్యాప్తంగా ఉద్యమం చేపట్టేందుకు కేసీఆర్ సిద్ధంగా ఉన్నారు అని టీఆర్ఎస్ ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కొత్త రాజ్యాంగంపై అనవసరంగా రాద్ధాంతం చేయవద్దని విపక్షాలకు విజ్ఞప్తి చేస్తున్నా. ప్రతిపక్షాలకు చేతనైతే కొత్త రాజ్యాంగంపై రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ప్రతిపక్షాల తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదు. కేసీఆర్ దిష్టి బొమ్మలు దగ్ధం చేస్తే గ్రామాల్లో కాంగ్రెస్, బీజేపీ నేతలను అడ్డుకుంటాం అని గువ్వల బాలరాజు హెచ్చరించారు.

## దళిత బంధు లబ్ధిదారులకు వాహనాల పంపిణీ

హన్మకొండ, ఫిబ్రవరి 3:: జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం నాడు దళితబంధు కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన 4 కోట్ల 81 లక్షల 49 వేల రూపాయల విలువైన వాహనాలను కమలాపూర్ మండలం లోని 51 మంది షెడ్యూల్ కులాల లబ్ధిదారులకు రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, రాష్ట్ర షెడ్యూలు కులాల అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ మంత్రి సత్యవతి రాథోడ్, ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్ పంపిణీ చేసారు. అందులో భాగంగా 10 హార్వెస్టర్లు, రెండు ట్రాన్స్ పోర్ట్ వాహనాలు, ఒక ఆటో ట్రాలీ, రెండు బొలోరో వాహనాలు, ఒక జెసిబి, 16 ట్రాక్టర్లుడ రోటా వేటర్లు, 2 ట్రాక్టర్లు, ట్రాలీలు లబ్ధిదారులకు అందజేశారు.


### చరిత్రలో నేటినిజం



కం॥ సప్నమల్లా - తెరపై - ప్రా
ముఖ్యమ్ముగు పాత్రలందు మురిపించుటచే
ఖ్యాతుల మనసులలో
ప్రఖ్యాత మ్మయ్యె "ఊర్మిళా మంటోడ్కర్"

-రాధశ్రీ

( ఫిబ్రవరి 4 నటి ఊర్మిళా మంటోద్కర్ పుట్టిన రోజు...)



సెల్: 9494481210

## క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉందాం

(04 ఫిబ్రవరి 'ప్రపంచ క్యాన్సర్ దినం' సందర్భంగా)

శరీరంలోని ఏదైన ఒక అవయవ భాగంలో కణజాలం అపరిమితంగా, నియంత్రణ లేకుండా పెరగడం మరియు ఇతర కణజాలానికి వ్యాపించడం వల్ల గడ్డలు ఏర్పడే అనారోగ్య స్థితిని క్యాన్సర్ వ్యాధిగా పిలుస్తారు. అతి ప్రమాదకర ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధికి పూర్తి చికిత్స నేటికీ లేదు. క్యాన్సర్ రాకుండా నివారణ చర్యలు మరియు తొలి దశలో గుర్తించడం వల్ల చికిత్సతో నయం చేయడానికి అవకాశం ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా మానవాళికి క్యాన్సర్ వ్యాధి పట్ల కనీస అవగాహన, రాకుండా ఉండానికి తీసుకోవలసిన నివారణ చర్యలు, తొలి దశలో గుర్తించే పద్ధతులు లాంటి మౌలిక అంశాలను వివరించే సదుద్దేశంతో 'యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ క్యాన్సర్ కంట్రోల్' చొరవతో ప్రతియేటా 04 ఫిబ్రవరి రోజున "ప్రపంచ క్యాన్సర్ దినం" పాటిస్తున్నాం. 2022 నుండి 2024 వరకు మూడు ఏండ్ల పాటు 'క్లోజ్ ది కేర్ గ్యాప్' నినాదంతో క్యాన్సర్ పట్ల అవసర ప్రచారాన్ని కల్పించే ఏర్పాట్లు చేశారు. కోవిడ్-19తో పాటు క్యాన్సర్ వ్యాధి ఒకేరకమైన శ్వాసకోశ వ్యాధి లక్షణాలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్స లాంటి అంశాలను కలిగి ఉంటాయి. 07 నవంబర్‌న ప్రతి ఏట భారత్‌లో 'జాతీయ క్యాన్సర్ అవగాహన దినం' పాటించుట (2014 నుంచి) ఆనవాయితీగా మారిందని మనకు తెలుసు.

క్యాన్సర్‌లలో 100కు పైగా రకాలు ఉన్నాయి. వీటిలో రొమ్ము, ఊపిరితిత్తులు, నోటి, చర్మ, గర్భాశయ, ప్యాంక్రియాస్, ప్రోస్టేట్, ఎముకలు లాంటి అవయవాలకు క్యాన్సర్ వస్తుంది. క్యాన్సర్‌లలో కార్సినోమా (చర్మ, రొమ్ము, ప్యాంక్రియాస్, ఇతర గ్రంథులకు) సర్కోమా (రక్తనాళాలు, ఎముకలు, కార్టిలేజ్, కొవ్వు, కండరాలకు), మెలనోమా (చర్మ పిగ్మెంట్ కణాలు), లింఫోమా (లింఫోసైట్స్) మరియు ల్యుకేమియా (రక్తం) వర్గాలు ఉన్నాయి. పలు రకాల క్యాన్సర్లలో ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ అతి ప్రమాదకరమైనదిగా గుర్తించబడింది. మన దేశంలో ప్రతి రోజు 1300 మంది క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు మరణిస్తున్నారని తేలింది. ఇండియాలో పురుషులకు ఊపిరితిత్తుల క్యాన్సర్ మరియు స్త్రీలలో గర్భాశయ క్యాన్సర్లు ప్రాణాంతకంగా మారాయి. క్యాన్సర్ కట్టడికి సరైన చర్యలు తీసుకోవడంలో విఫలమైతే 2030 నాటి ప్రతి ఏట 5.4 మిలియన్ల ప్రజలు కాన్సర్ వ్యాధిగ్రస్తులు, 2.5 మిలియన్ల రోగులు మరణిస్తారని అంచనా వేస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా అసంక్రమిత వ్యాధులతో 71 శాతం మరణాలు నమోదు అవుతున్నాయి. ఇండియాలో అసంక్రమిత వ్యాధులతో 63 శాతం మరణాలు జరుగుతుండగా, 9 శాతం మంది క్యాన్సర్ వ్యాధులతో చనిపోతున్నారు. 1975లో ప్రారంభించిన జాతీయ క్యాన్సర్ నియంత్రణ ప్రోగ్రామ్ (నేషనల్ క్యాన్సర్ కంట్రోల్ ప్రోగ్రామ్) ద్వారా క్యాన్సర్‌కు వైద్య సదుపాయాలను దేశవ్యాప్తంగా నెలకొల్పడం, 1984-85 నుంచి నివారణ చర్యలు మరియు తొలి దశలో గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, హంగేరీ, బెల్జియం, కెనడా, డెన్మార్క్, ఐర్లాండ్, యూయస్ లాంటి దేశాలలో క్యాన్సర్ బారిన పడిన వ్యాధిగ్రస్థుల శాతం ఎక్కువగా ఉంది. ప్రపంచ క్యాన్సర్ రోగుల్లో 8.17 శాతం వ్యాధిగ్రస్థులు ఇండియాలోనే ఉన్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసింది. భారత్‌లో 2.25 మిలియన్ల క్యాన్సర్ రోగులు ఉండగా, ప్రతియేటా 1.1 మిలియన్ల క్యాన్సర్ కొత్త కేసులు నమోదు అవుతున్నాయి. వీటిలో దాదాపు 66 శాతం కేసులు క్యాన్సర్ ముదిరిన తరువాతనే బయట పడడంతో వ్యాధిగ్రస్థుడి ప్రాణం కాపాడడం కష్టం అవుతున్నది. ఇండియాలో ప్రతి 8 నిమిషాలకు ఒక మహిళ గర్భాశయ క్యాన్సర్‌తో మరణించడం విచారకరం. భారతీయుల్లో ప్రతి పది మందిలో ఒకరికి తమ జీవితకాలంలో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని, చనిపోయిన ప్రతి 15 మందిలో ఒకరు క్యాన్సర్ వ్యాధితో మరణిస్తున్నారని అంచనా. 2018లో దేశవ్యాప్తంగా 3.18 లక్షల మరణాలు పొగాకు ఉత్పత్తుల అలవాటు కారణ క్యాన్సర్‌తో జరిగాయని తేలింది. పురుషుల్లో 25 శాతం క్యాన్సర్ మరణాలు నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో జరగడం మరియు 25 శాతం క్యాన్సర్ మహిళా మరణాలు రొమ్ము, నోటి క్యాన్సర్‌తో జరుగుతున్నాయి. పొగాకు వాడకంతో 14 రకాల క్యాన్సర్‌లు రావడం గమనించారు. దీనికి తోడుగా ఆల్కహాల్ సేవనం, మాదకద్రవ్యాల దుర్వినియోగం, ఆహారలేమి, పోషకాహారలోపం, అసురక్షిత లైంగిక సంబంధాలు, గాలి కాలుష్యం లాంటి కారణాలతో క్యాన్సర్ వ్యాధి రావచ్చనే కనీస అవగాహన కలిగి ఉండాలి.

క్యాన్సర్ వ్యాధికి ఎలాంటి ముందస్తు లక్షణాలు కనిపించని కారణంగా రోగ నిర్ధారణ చేయడం కష్టం అవుతున్నది. ఒక వేళ ముందుగా వ్యాధి నిర్ధారణ జరిగితే, చాలా సందర్భాలలో వైద్యంతో నయం చేసే అవకాశం ఉంటుంది. క్యాన్సర్ వ్యాధి లక్షణాలుగా విరోచనాలు, దగ్గు, చర్మంపై మచ్చలు ఏర్పడడం, ఉమ్మితో రక్తం పడడం, రక్తహీనత, రొమ్ములో గడ్డలు, మూత్ర సంబంధ మార్పులు, మలంలో రక్తం పడడం, బీజాలలో గడ్డలు లాంటివి గుర్తించబడతాయి. ఇండియాలో రొమ్ము, గర్భాశయ, ఊపిరితిత్తులు, జీర్ణకోశ మరియు పెద్ద ప్రేగు క్యాన్సర్‌లు మాత్రమే దాదాపు 50 శాతం కనిపిస్తాయి. క్యాన్సర్ వ్యాధి చికిత్సలో ఇమ్యునోథెరపీ, కీమోథెరపీ, రేడియేషన్ థెరపీ, హార్మోన్ థెరపీ, టార్గెటెడ్ థెరపీ, స్టెమ్ సెల్ మార్పిడి, శస్త్రచికిత్స, ప్రిసిషన్ మెడిసిన్ లాంటి విధానాలు వాడతారు. శరీర బరువు నియంత్రణ, మంచి పోషకాహార అలవాటు, శారీరక శ్రమ, టీకాలు వేయించుకోవడం, తీవ్రమైన ఎండ పడకుండా జాగ్రత్తలు, పొగాకు ఉత్పత్తులకు అలవాటుకు దూరంగా ఉండడం, క్రమం తప్పకుండా చెకప్ చేయించుకోవడం, శరీరంలో గడ్డలు కనిపిస్తే వైద్యున్ని సంప్రదించడం వంటి సత్వర జాగ్రత్తలు తీసుకోవడం లాంటి జాగ్రత్తల వల్ల క్యాన్సర్ వ్యాధి నివారించబడుతుంది. ప్రాణాంతర క్యాన్సర్ వ్యాధి పట్ల సంపూర్ణ అవగాహన కలిగి, క్రమశిక్షణ గల జీవనశైలితో ఆరోగ్యకర సమాజ స్థాపనలో భాగస్వాములం అవుదాం. క్యాన్సర్‌ను సమాజం నుంచి తరిమి కొడదాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## ముఠాగా ఏర్పడి వ్యవహరించినందుకు టైర్ ఉత్పత్తిదారులు, వారి అసోసియేషన్‌కు జరిమానా విధించిన సిసిఐ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:తాము అమ్మే క్రాస్ ప్లై బయాస్ టైర్ రకాల ధరలను పెంచేందుకు ముఠాగా ఏర్పడి, కలిసి పని చేస్తున్న అపోలో టైర్స్ లిమిటెడ్, ఎంఆర్ఎఫ్ లిమిటెడ్, జెకె టైర్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, బిర్లా టైర్స్ లిమిటెడ్, వారి అనుబంధ ఆటోమేటివ్ టైర్ మాన్యుఫాక్చరర్ అసోసియేషన్ (ఎటిఎంఎ)కి వ్యతిరేకంగా 31.08.2018న కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) తుది ఉత్తర్వులను జారీ చేసింది. వీరి ముఠాగా ఏర్పడడం ద్వారా వీరిలో ప్రతి సంస్థ రీప్లేస్ మెంట్ మార్కెట్‌లో క్రాస్ ప్లై బయాస్ టైర్ల ధరలను పెంచడం, మార్కెట్‌లో ఉత్పత్తి, సరఫరా చేయడం, నియంత్రించడం వంటి చర్యలకు పాల్పడుతూ కాంపిటీషన్ చట్టం, 2002 (ది యాక్ట్) లోని సెక్షన్ 3(3)(ఎ), రెడ్ విత్ సెక్షన్ 3 (1) నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించాయి.

ఎంఆర్ ఎఫ్ లిమిటెడ్ కోరినట్టుగా మద్రాసు హైకోర్టు డబ్ల్యు.ఎ. నెం. 529 ఆఫ్ 2018న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు సిసిఐ పైన పేర్కొన్న ఉత్తర్వులను సీల్డ్ కవర్‌లో ఉంచింది. అనంతరం, మద్రాస్ హైకోర్టు డివిజన్ బెంచి 06.01.2022న ముందు పేర్కొన్న రిట్ అప్పీల్‌ను డిస్మిస్ చేసింది. దీనితో వ్యథ చెందిన టైర్ కంపెనీలు సుప్రీం కోర్టు ఎదుట ఎస్ఎల్‌పీలను దాఖలు చేయగా, 28.01.2022న కోర్టు వాటిని జారీ చేసింది.

ఈ కేసును కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంసిఎ) చట్టంలోని సెక్షన్ 19(1)(బి) కింద చేసిన ప్రస్తావన మేరకు ప్రారంభించింది. ఈ ప్రస్తావనను ఆలిండియా టైర్ డీలర్స్ ఫెడరేషన్ (ఎఐటిడిఎఫ్) ఎంసిఎకు అందించిన విజ్ఞప్తి మేరకు చేశారు.

తమ అసోసియేషన్ అయిన ఆటోమోటివ్ టైర్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఎటిఎంఎ) వేదిక ద్వారా టైర్ ఉత్పత్తిదారులు ధరలకు సంబంధించిన సున్నితమైన డాటాను ఇచ్చిపుచ్చుకునేవారని, అందరూ కలిసి టైర్ల ధరలను నిర్ణయించేవారని కమిషన్ పేర్కొంది. ఎటిఎంఎ ఉత్పత్తి, దేశీయ అమ్మకాలు, వాస్తవకాలంలో టైర్ల ఎగుమతికి సంబంధించి కంపెనీల వారీగా, సెగ్మెంట్ల వారీగా డాటా (అటు నెలవారీ, ఇటు సంచిత) సమాచారాన్ని ఎటిఎంఎ సేకరించి, సంకలనం చేసిందని కమిషన్ కనుగొంది. తద్వారా సున్నితమైన సమాచారాన్ని పంచుకోవడం వల్ల టైర్ ఉత్పత్తిదారుల మధ్య సమన్వయ సహకారాలు సులవయ్యాయని కమిషన్ పేర్కొంది.

తదనుగుణంగా, ఐదుగురు టైర్ ఉత్పత్తిదారులు, ఎటిఎంఎను చట్టంలోని సెక్షన్ 3లోని అంశాలను 2011-12లో ఉల్లంఘించిన దోషులుగా సిసిఐ నిర్ధారించింది. ఈ చట్టంలోని సెక్షన్ 3 ముఠాలుగా ఏర్పడడం సహా పోటీ వ్యతిరేక ఒప్పందాలను నిషేధిస్తుంది.

అపోలో టైర్లపై రూ. 425.53 కోట్లు, ఎంఆర్?ఫ్ లిమిటెడ్‌పై రూ. 622.09 కోట్లు, సియట్ లిమిటెడ్‌పై రూ.252.16 కోట్లు, జెకె టైర్లపై రూ. 309.95 కోట్లు, బిర్లా టైర్లపై రూ. 178.83 కోట్లను జరిమానా విధించడమే కాక, సీజ్ అండ్ డెసిస్ట్ ఉత్తర్వులను కూడా సిసిఐ జారీ చేసింది. ఇందుకు అదనంగా, ఎటిఎంఎపై రూ.0.084 కోట్ల జరిమానాను విధించింది. సభ్య టైర్ కంపెనీలు లేదా ఇతరత్రా ద్వారా హోల్‌సేల్, రిటైల్ ధరల వివరాలను సేకరించడం నుంచి ఎటిఎంఎ మానుకొని, దూరంగా ఉండాలని కూడా ఆదేశాలు జారీ చేసింది.

అంతేకాకుండా. చట్టంలోని సెక్షన్ 48లోని నిబంధనల ప్రకారం ముందు పేర్కొన్న టైర్ కంపెనీలు, ఎటిఎంఎకు చెందిన కొందరు వ్యక్తులను, వారి సంబంధిత కంపెనీలు/ సంస్థ పోటీ వ్యతిరేక ప్రవర్తనకు బాధ్యులుగా పరిగణించింది.

## భారత్-పాక్ యుద్ధంలో వైమానిక యోధుడు నిర్మల్ జిత్ సింగ్ సెఖోన్‌కు నివాళులు అర్పించిన టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి మానికా బాత్రా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: 1971 భారత్-పాక్ యుద్ధంలో పోరాడిన నిర్మల్‌జిత్ సింగ్ సెఖోన్‌కు నివాళులు అర్పించేందుకు టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి మానికా బాత్రా నేడు జాతీయ యుద్ధ స్మారకాన్ని సందర్శించారు. నిర్మల్‌జిత్ సింగ్ చారిత్రాత్మక యుద్ధంలో అత్యుత్తమ సాహసాన్ని, దృఢ సంకల్పాన్ని ప్రదర్శించారు.

స్మారక స్థలిలో ఏర్పాటు చేసిన పరమ యోధ స్థల్ పేరిట ఏర్పాటు చేసిన గ్యాలెంట్రీ గ్యాలరీలో పరమ వీర చక్ర పొందిన మొత్తం 21 మంది గ్రహీతల నడుమ ఏర్పాటు చేసిన ఫ్లైయింగ్ యుద్ధ హీరో ప్రతిమ వద్ద టిటి క్రీడా కారిణి తన నివాళులను అర్పించారు.

యుద్ధం గురించి, మన సైనికులు చేసిన అత్యుత్తమ త్యాగానికి సంబంధించి లిఖించిన రాతలు నన్ను కట్టిపడేశాయి. భారతీయురాలిగా నేడు నా మనసు కృతజ్ఞతతో, ఆత్మగౌరవంతో నిండిపోయిందని, ఒలింపియన్ అన్నారు.

ఘనమైన రాజ్‌పథ్, సెంట్రల్ విస్టా ప్రస్తుత లేఔట్, అనురూపత జాతీయు యుద్ధ స్మారక అప్లికేషన్ సృష్టించడం కారణంగా డిజిటల్ అప్పీల్‌ను కలిగి ఉంది. విధులు నిర్వర్తిస్తూ మరణించిన వారికి దృశ్యమాధ్యమం ద్వారా నివాళులు అర్పించేందుకు వీలుగా స్క్రీన్ల ఏర్పాటును కూడా కలిగి ఉంది.

దృశ్య మాధ్యమం ద్వారా మరొక యుద్ధ వీరుడు కెప్టెన్ విక్రమ్ బాత్రాకు నివాళులు అర్పిస్తూ, స్మారక చిహ్న రూపకల్పన, నిర్మాణం అమరవీరులు అమరత్వం పొందేలా చేస్తుంది. అంతేకాదు, మొబైల్ యాప్ ఆధారిత వర్చువల్ టైర్ గైడ్, వర్చువల్ నివాళి కోసం డిజిటల్ ప్యానెల్‌ను ఆధునీకరించడం వంటి సౌకర్యాల కారణంగా ప్రతి పౌరుడు ఎక్కడి నుంచైనా సులభంగా నివాళులు అర్పించడం సులభం అవుతందని మానికా అన్నారు. యోధులైన అమరవీరులకు తగిన నివాళులు అర్పించే, స్మారక స్థలాన్ని సందర్శించే సందర్శకులందరికీ ఆకర్షణ కేంద్రంగా నిలిచే ప్రత్యేక సావనీర్ ఔట్‌లెట్ స్మారికను కూడా క్రీడాకారిణి సందర్శించారు.

## ఉరవకొండ ఎస్ .ఐ గా- టీ పీ వెంకటస్వామి



అమరావతి, ఫిబ్రవరి 3: ఉరవకొండ ఎస్ ఐ గా టీ వీ వెంకటస్వామి బాధ్యతలు తీసుకున్నారు. జిల్లా ఎస్పీ ఉత్తర్వులు మేరకు వజ్రకరూరు ఎస్ ఐ గా విధులు నిర్వహిస్తున్న ఎస్ ఐ.. టీవీ వెంకటస్వామి ని ఉరవకొండకు బదిలీ చేశారు. పోలీసు స్టేషన్ సిబ్బంది నూతన బాధ్యతలు చేపట్టిన వెంకటస్వామి కి ఘనస్వాగతం పలికారు. వివిధ సమస్యలతో పోలీసు స్టేషన్ కి వచ్చే ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని శక్తి వంచన లేకుండా తన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. ఉరవకొండ ఎస్ ఐ గా పని చేస్తున్న రమేష్ రెడ్డి అనంతపురం స్పెషల్ బ్రాంచ్ కి బదిలీ చేశారు.

## ఖేలో ఇండియా పథకానికి 2022-23 బడ్జెట్‌లో 48% పెరిగిన కేటాయింపులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:క్రీడల్లో ఎక్కువ మంది పాల్గొనేలా చూసి, క్రీడాకారుల ప్రతిభను పెంచాలన్న లక్ష్యంతో ప్రారంభించిన ' ఖేలో ఇండియా ' జాతీయ పథకాన్ని కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 15 వ ఆర్థిక సంఘం (2021-22 నుంచి 2025-26) కాలపరిమితిలో దీనిని 3165.50 కోట్ల రూపాయల ఖర్చుతో అమలు చేయడం జరుగుతుంది.

పథకాన్ని కొనసాగించేందుకు ఆమోదం తెలిపిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీకి క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ అనురాగ్ ఠాకూర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఖేలో ఇండియా పథకాన్ని మరో అయిదు సంవత్సరాల వరకు కొనసాగించేందుకు ఆమోదం తెలిపిన ప్రధానమంత్రి బడ్జెట్ కేటాయింపులు ఎక్కువ చేసి క్రీడలకు జాతీయ స్థాయి ప్రాధాన్యత కల్పించారని శ్రీ అనురాగ్ ఠాకూర్ అన్నారు. 2022 బడ్జెట్ లో పథకం కేటాయింపులు 48% పెరిగాయని, పథకం ప్రధానమంత్రి అవార్డుల పరిధిలో చేరిందని ఆయన వెల్లడించారు.

ఖేలో ఇండియా పథకాన్ని క్రీడలు యువజన సర్వీసుల మంత్రిత్వ శాఖ కింద కేంద్ర ప్రభుత్వం ఒక జాతీయ ప్రాధాన్యత కార్యక్రమంగా అమలు చేస్తోంది. దేశంలో క్రీడా సంస్కృతి ని పెంపొందించి, క్రీడా ప్రమాణాలు మెరుగు పరిచి, ప్రజల్లో దాగి ఉన్న క్రీడా సామర్థ్యాన్ని వెలికి తీసి క్రీడా రంగంలో దేశాన్ని అత్యున్నత స్థాయికి తీసుకుని వెళ్లాలన్నది పథకం ప్రధాన లక్ష్యాలలో ఒకటి. క్రీడా మైదానాల అభివృద్ధి, శిక్షణలో ప్రజల భాగస్వామ్యం, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనే విధంగా క్రీడా పోటీలను నిర్వహించడం, పాఠశాల, విశ్వవిద్యాలయ స్థాయిలలో పాటు గ్రామీణ / సాంప్రదాయ క్రీడల పోటీలను నిర్వహించడం, అంగవైకల్యం కలిగి ఉన్నవారికి, మహిళలకు క్రీడలను నిర్వహించడం, క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం, విశ్వవిద్యాలయాల్లో క్రీడా కేంద్రాలను నెలకొల్పడం, ప్రతిభను గుర్తించి ప్రోత్సాహించడం, విద్యారంగంలో క్రీడలకు సంబంధించిన అంశాలను ప్రవేశపెట్టడం, పాఠశాల విద్యార్థుల కోసం జాతీయ స్థాయి సౌష్టవ కార్యక్రమాన్ని అమలు చేయడం, శాంతి అభివృద్ధికి క్రీడలను ఉపయోగించడం లక్ష్యంగా ఖేలో ఇండియా పథకం అమలు జరుగుతోంది.

ప్రస్తుతం ఉన్న ఖేలో ఇండియా పథకం ప్రాథమిక లక్ష్యాలు, దృష్టి మరియు నిర్మాణం అలాగే ఉంచబడ్డాయి. అయితే, ఈ మంత్రిత్వ శాఖ ప్రస్తుత పథకాన్ని అమలు చేస్తున్న సమయంలో మంత్రిత్వ శాఖ, ఇతర సంస్థలు నిర్వహించిన సమీక్షల ద్వారా వెలుగు చూసిన అంశాలు, అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పథకంలో ఒకే విధంగా ఉన్న కొన్ని అంశాలను విలీనం చేయడం/ఉపయోగించడం ద్వారా పునర్వ్యవస్థీకరించి, హేతుబద్ధంగా పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా గతంలో అమలు చేసిన విధంగా కాకుండా అయిదు భాగాలుగా అమలు చేయాలని నిర్ణయించడం జరిగింది. ఇకపై పథకం కింద పేర్కొన్న అంశాలపై ఆధారపడి అమలు జరుగుతుంది. పథకంలో ఇతర అంశాలు, ఉత్తమ విధానాలను కొనసాగించి వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతేకాకుండా, పథకాన్ని సరళీకృత విధానంలో అమలు చేసి, కొన్ని అవసరం లేని అంశాలను తొలగించి పథకం హేతుబద్ధీకరించబడింది. అలాగే, 'ఖేలో ఇండియా వింటర్ గేమ్స్' 'క్రీడల పోటీలు మరియు ప్రతిభ అభివృద్ధి' భాగం కింద చేర్చబడ్డాయి. 'ఫిట్ ఇండియా ఉద్యమం' ఒక ప్రత్యేక మరియు అంకితమైన అంశంగా ప్రవేశపెట్టబడింది.

అథ్లెట్లు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు జాతీయ స్థాయి వేదికను అందుబాటులోకి తెచ్చి, వారి ప్రతిభకు సాన పెట్టి దానికి అవసరమైన ఆర్థిక సహాయం అందించాలన్న ప్రాథమిక లక్ష్యంతో పథకం రూపొందింది. ఖేలో ఇండియా గేమ్స్ ఈ ప్రయత్నానికి నాంది పలికాయి. 2017 నుండి 2021 వరకు ఖేలో ఇండియాలో భాగంగా మూడు సార్లు పాఠశాల, యువజన క్రీడా పోటీలను నిర్వహించడం జరిగింది. వీటితో పాటు ఖేలో ఇండియా విశ్వవిద్యాలయ స్థాయి పోటీలు, రెండు సార్లు ఖేలో ఇండియా వింటర్ గేమ్స్ నిర్వహించడం జరిగింది. ప్రతిభావంతులైన యువ క్రీడాకారులకు ఖేలో ఇండియా స్కాలర్‌షిప్‌ను గెలుచుకునే అవకాశం కల్పించడం, అత్యుత్తమ కోచ్‌లు మరియు అత్యాధునిక స్పోర్టింగ్ కాంప్లెక్స్‌ల ద్వారా ఉన్నత స్థాయి పోటీల కోసం శిక్షణ పొందే అవకాశం కల్పించాలన్న లక్ష్యంతో నిర్వహించిన పోటీల్లో 20,000 మంది అథ్లెట్లు పాల్గొన్నారు. దాదాపు 3,000 మంది అథ్లెట్లు ఖేలో ఇండియా అథ్లెట్స్ గా గుర్తించబడ్డారు, వీరు ప్రస్తుతం ఖేలో ఇండియా అకాడమీలో, ఆధునీకరించిన సాయ్ కేంద్రాల్లో శిక్షణ పొందుతున్నారు, వీరికి నెలకు 10,000 రూపాయలను అవుట్ ఆఫ్ పాకెట్ అలవెన్స్ అందిస్తున్నారు. వీరికి శిక్షణ, పరికరాలు, ఆహారం మరియు విద్య కోసం సహకారం అందిస్తున్నారు.

ఖేలో ఇండియా పథకంలోని "యుటిలైజేషన్ అండ్ క్రియేషన్/అప్‌గ్రేడేషన్ ఆఫ్ స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్" కింద మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కోసం గ్రాంట్-ఇన్-ఎయిడ్ కూడా ఇవ్వబడింది. గత అయిదు సంవత్సరాల కాలంలో ఈ మంత్రిత్వ శాఖ వివిధ క్రీడా విభాగాలు మరియు క్రీడాకారులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు 2,328.39 కోట్ల రూపాయల వ్యయంతో 282 పథకాల అమలుకు ఆమోదం తెలిపింది.

## రూ. 1575 కోట్లతో జాతీయ క్రీడా సమాఖ్యల సహాయ పథకం కొనసాగింపుకు ప్రభుత్వ ఆమోదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:భారతదేశంలో క్రీడలకు మరింత అండగా నిలబడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ క్రీడా సమాఖ్యలకు ఆర్థిక సహాయాన్నిచ్చే పథకాన్ని కొనసాగించాలని నిర్ణయించింది. ఇందుకోసం 2021-22 నుంచి 2025-26 వరకు 15 వ ఆర్థిక సంఘం ద్వారా రూ. 1575 కోట్ల బడ్జెట్ కేటాయించింది. జాతీయ క్రీడా సమాఖ్యలకు ఇచ్చే ఈ ఆర్థిక సహాయ పథకం అన్ని రకాల జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు సమాయత్తం కావటానికి ఈ పథకం సహాయకారిగా ఉంటుంది. ఇందులో ఇలంపిక్స్, పారా ఒలంపిక్స్, ఏషియన్ గేమ్స్, పారా ఏషియన్ గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్, ఇతర ప్రధానమైన అంతర్జాతీయ టోర్నమెంట్స్ ఉన్నాయి.

ఈ పథకం కొనసాగించటానికి ఆమోదం తెలియజేసినందుకు ప్రధాని శ్రీ నరేంద్ర మోదీకి, ఆర్థికమంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ కు యువజన వ్యవవహారాలు, క్రీడల శాఖామంత్రి శ్రీ అనురాగ్ ఠాకూర్ ధన్యవాదాలు తెలియజేశారు. క్రీడారంగంలో గర్వంగా నిలబడాలన్న దేశ ఆకాంక్షలకు ఇది అత్యంత ప్రోత్సాహకరంగా ఉంటుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

ఈ విధంగా క్రీడాసమాఖ్యలకు కేటాయించిన ఈ మొత్తాన్ని 2022-26 మధ్య కాలంలో జరిగే జాతీయం, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనటానికి వీలుగా క్రీడాకారులకు శిక్షణ ఇవ్వటానికి వినియోగిస్తారు. అందులో ముఖ్యమైనవి 2022 లో జరిగే కామన్వెల్త్, ఏషియన్ గేమ్స్ 2024 లో జరిగే ఒలంపిక్స్, పారాలింపిక్స్, 2026 లో జరిగే ఏషియన్, కామన్వెల్త్ గేమ్స్.

ఈ పథకం ద్వారా యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ అందించే ఆర్థిక సహాయాన్ని జాతీయ క్రీడా సమాఖ్యలు జాతీయ శిక్షణాశిబిరాలు నిర్వహించటానికి, క్రీడాపరికరాలు కొనటానికి, క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి కోచింగ్ ఇప్పించటానికి, క్రీడాకారుల పనితీరుమీద డేటా విశ్లేషణకు, స్పోర్ట్స్ సైన్స్ సాయం, గాయపడిన క్రీడాకారులు కోలుకోవటానికి సాయం, విదేశీ కోచ్ ల నియామకం, ఈ సమాఖ్యలలో వృత్తినైపుణ్యంతో కూడిన యాజమాన్య వ్యవస్థ ఏర్పాటుకు వెచ్చిస్తారు. అత్యంత నిపుణులైన క్రీడాకారులకు ఈ సమాఖ్యల ద్వారా అండగా నిలవటంతోబాటుగా ప్రతిభాగల క్రీడాకారులను గుర్తించి వారికి అన్నివిధాలా ప్రోత్సాహం ఇవ్వటం కూడా ప్రధానమైన విషయం. అప్పుడే క్రీడల పరంగా భారత్ ఒక శక్తిమంతమైన దేశంగా ఎదిగి పోటీలో నిలబడగలుగుతుంది.

ఈ పథకం ద్వారా జాతీయ క్రీడా సమాఖ్యలకు అండగా నిలబడటం వలన గత కొన్నేళ్ళుగా అద్భుత ఫలితాలు కనబడుతూ వస్తున్నాయి. భారత్ 2020 టోక్యో ఒలంపిక్స్ లో 6 విభాగాలలో 7 పతకాలు సాధించింది. ఇది దేశానికి వచ్చిన అత్యధిక పతకాల సంఖ్య. 2020 టోక్యో పారాలింపిక్స్ లో భారత్ కు 19 పతకాలు రావటం వల్ల ఇంతకు ముందు అన్ని పారాలింపిక్స్ లోనూ ఉమ్మడిగా సాధించిన మొత్తం 12 పతకాలకంటే అత్యధిక ప్రతిభ కనబరచినట్టయింది. భారత్ కు కామన్వెల్త్ గేమ్స్ లో 2018 లో 66 పతకాలు వచ్చాయి. 2018 ఏషియన్ గేమ్స్ లో అత్యధికంగా వచ్చిన 69 పతకాలు భారత్ కు వచ్చిన పతకాల్లో చాలా ఎక్కువ. 2018 పారా ఏషియన్ గేమ్స్ లో 72 పతకాలు రావటం మరో రికార్డు కాగా యూత్ ఒలంపిక్స్ గేమ్స్ లో 13 పతకాలు లభించాయి.

## టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కారుపై కోడిగుడ్లతో దాడి




హైదరాబాద్, ఫిబ్రవరి 3:కోడిగుడ్లతో టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కారుపై దాడి జరిగింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం చౌరస్తాలో ఇబ్రహీంపట్నంలో టీఆర్ఎస్ ఎమ్మెల్యే కారుపై కొంతమంది గుడ్లతో దాడికి దిగారు. ఎన్ఎస్ యూఐ సభ్యులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి కారుపై గుడ్లతో దాడికి పాల్పడ్డారు.

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి వాహనాన్ని అడ్డుకున్న ఎన్ఎస్ యూఐ సభ్యులు ఆయన కారుపై కోడిగుడ్లు విసిరారు. ఎన్ఎస్ యూఐ సభ్యులు చర్యతో ఆగ్రహించిన మంచిరెడ్డి అనుచరులు..గన్ మన్ వెంటనే కారు దిగి మరీ వారిని అడ్డుకున్నారు. అనంతరం వారిని పట్టుకుని చితక్కొట్టినట్లుగా తెలుస్తోంది. తమ నాయకుడి వాహనాన్నే అడ్డుకుంటారా ? దాడులు చేస్తారా ? అంటూ ఎదురుదాడికి దిగారు.

దీంతో సాగర్ హైవేపై టెన్షన్ వాతావరణం నెలకొంది. మూడు రోజుల క్రితం ఎన్ఎస్ యూఐ నేతలు ఎమ్మెల్యే కాంప్ కార్యాలయాన్ని ముట్టడించారు. అప్పుడు కూడా ఉద్రిక్తత ఏర్పడింది. అప్పుడు కూడా కాంగ్రెస్ శ్రేణులపై టీఆర్ఎస్ కార్యకర్తలు దాడికి దిగారు.

అయితే ఆ ఘటన మరువక ముందే ఈరోజు టీఆర్ఎస్ ఎమ్మెల్యే కారుపై కోడిగుడ్లతో దాడి చేశారు. అయితే ఆరోజు ఘటనకు నిరసనగా ఇప్పుడు ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డుకుని కోడిగుడ్లు కొట్టారని తెలుస్తోంది.

## గిరిజన సాధకులకు సౌకర్యాలు కల్పిస్తున్న కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:"ఆజాదీ-కా-అమృత్-మహోత్సవ్" (భారతదేశంఏ75) అనేది భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలవుతున్న సందర్భాన్ని స్మరించుకుంటూ, ఉత్సవాలు జరుపుకోడానికి భారత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం. 2021 మార్చి 12వ తేదీన అహ్మదాబాద్ లోని సబర్మతి ఆశ్రమం నుంచి మొదలైన 'పాదయాత్ర' (ఫ్రీడమ్ మార్చ్) కు జెండా ఊపి ప్రధానమంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2021 మార్చి, 12వ తేదీ నుంచి, "ఆజాదీ-కా-అమృత్-మహోత్సవ్" లో భాగంగా, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

దేశంలోని ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజన నాయకుడైన బిర్సా ముండా పుట్టిన రోజు న గిరిజన స్వాతంత్ర్య సమరయోధులందరినీ గౌరవించేందుకు భారత ప్రభుత్వం నవంబర్, 15వ తేదీ ని "జన్-జాతీయ-గౌరవ్- దివస్" గా ప్రకటించింది. "ఆజాదీ-కా-అమృత్-మహోత్సవ్" వేడుకల్లో భాగంగా, రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాలతో సహా అనుబంధ సంస్థల సమన్వయంతో 2021 నవంబర్, 15వ తేదీ నుంచి, 2021 నవంబర్, 22వ తేదీ వరకు, కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ 'ఐకానిక్ వీక్' వేడుకలను నిర్వహించింది.

రాబోయే రోజుల్లో, జాతీయ / రాష్ట్ర స్థాయి ట్రైబల్ క్రాఫ్ట్ మేళా / డ్యాన్స్ ఫెస్టివల్ / పెయింటింగ్ పోటీలు; ఆడియో వీడియో డాక్యుమెంటేషన్, యానిమేషన్ ఫిల్మ్‌లు, వివిధ రంగాల్లో గిరిజన సాధకులకు వెసులుబాటు కల్పించడం, గిరిజన విషయాలపై వెబినార్లు, వర్క్‌షాప్ లు నిర్వహించడం; కొత్తగా నిర్మించిన గిరిజన పరిశోధనా సంస్థ భవనాల ప్రారంభోత్సవం వంటి వివిధ కార్యక్రమాలను, ప్రస్తుత కోవిడ్ పరిస్థితులకు లోబడి భౌతికంగా లేదా వర్చువల్ గా లేదా హైబ్రిడ్ పద్దతిలో నిర్వహించాలని ప్రణాళికలను సిద్ధం చేయడం జరిగింది.

ఈ విషయాన్ని గిరిజన వ్యవహారాల మంత్రి శ్రీ అర్జున్ ముండా ఈ రోజు రాజ్యసభలో తెలియజేశారు.

## హిందూపురంలో ర్యాలీ చేపట్టనున్న- ఎమ్మెల్యే, నటుడు బాలకృష్ణ

అమరావతి, ఫిబ్రవరి 3:ఏపీలో కొత్తగా పలు జిల్లాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కాగా హిందూపురం కేంద్రంగా జిల్లాని ప్రకటించాలని నటుడు, టిడిపి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ డిమాండ్ చేశారు. కాగా రేపు హిందూపురంలో ఆయన ర్యాలీ చేపట్టనున్నారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ఈ ర్యాలీ జరగనుంది. ర్యాలీ అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద బాలకృష్ణ మౌన దీక్ష చేపట్టనున్నారు. ఉద్యమ కార్యాచరణపై రేపు సాయంత్రం అఖిలపక్ష నేతలతో చర్చించనున్నారు. అనంతరం టీడీపీ కార్యకర్తలతోనూ సమావేశం కానున్నారు.

## మేడారం సమ్మక్క, సారమ్మలని దర్శించుకున్న వైఎస్ షర్మిల



ములుగు, ఫిబ్రవరి 3: వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైయస్ షర్మిల మేడారం జాతరని సందర్శించారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో వనదేవతలు సమ్మక్క, సారమ్మలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిలువెత్తు బెల్లంని అమ్మవార్లకి సమర్పించారు. షర్మిలకి అధికారులు ఘనస్వాగతం పలికారు. అందరిని చిరునవ్వుతో పలకరించారు షర్మిల. అనంతరం మొక్కులను చెల్లించుకున్నారు.

## కాంగ్రెస్‌కు ఓటేస్తే, బీజేపీకి ఓటు వేసినట్టే - అరవింద్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:కాంగ్రెస్ కు ఓటేస్తే పరోక్షంగా బిజెపికి ఓటేసినట్టేనని సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. కాగా కొన్నేళ్ళుగా గోవాని కాంగ్రెస్ పాలించిందని..అయితే బిజెపికి క్యాడర్ ఫీడర్ గా మారిపోయిందన్నారు. గోవాలో ఆమ్ ఆద్మీ, బిజెపిల మధ్య పోరుకొనసాగుతోందని తెలిపారు. బిజెపిని వెళ్లగొట్టాలంటే మాకే ఓటు వేయండని కేజ్రీవాల్ కోరారు. మీకు స్వచ్ఛమైన, నిజాయితీ గల ప్రభుత్వం కావాలంటే, మీరు ఆప్‌కి ఓటు వేయవచ్చు. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా బీజేపీకి ఓటు వేయడం మరో ఆప్షన్. మీరు కాంగ్రెస్‌కు ఓటు వేసినప్పుడే పరోక్ష ఓటింగ్ అని, ఆ కాంగ్రెస్ వ్యక్తి గెలిచి బీజేపీకి వెళ్తాడని కాంగ్రెస్ పై విరుచుకుపడ్డారాయన. కోస్తా రాష్ట్రంలో 2017 ఎన్నికల నాటి నుండి పరిస్థితిని ప్రస్తావించారు. ఈ ఎన్నికల్లో 17 మంది ఎమ్మెల్యేలతో అతిపెద్ద పార్టీగా అవతరించిన కాంగ్రెస్‌కు ఇప్పుడు కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత మిగిలిన వారిలో ఎక్కువ మంది బీజేపీలో చేరారన్నారు.

# పీఆర్సీపై ఇచ్చిన జీవోను రద్దు చేసే ప్రసక్తే లేదు : బొత్స సత్యనారాయణ

అమరావతి, ఫిబ్రవరి 3:పీఆర్సీపై ఇచ్చిన జీవోను రద్దు చేసే ప్రసక్తే లేదని ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల ఛలో విజయవాడ కార్యక్రమంపై మంత్రి బొత్స సత్యనారాయణ స్పందించారు. ప్రభుత్వం ఉద్యోగులను ఎక్కడా భయపెట్టలేదని చెప్పారు. ఎవరిపైనా ఒత్తిడి చేయలేదన్నారు. పీఆర్సీ లో కొన్ని సవరణలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అలాగే అశుతోష్ మిశ్రా కమిటీ నివేదిక ఇప్పుడు బయటపెట్టడం వల్ల కూడా ఎలాంటి ప్రయోజనం లేదని బొత్స సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. ఏదైనా చర్చల ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. ఇప్పటికీ ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో చర్చించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. రోడ్డెక్కి ఆందోళన చేయడం సరికాదని బొత్స సత్యనారాయణ కోరారు.

# జిన్నా టవర్ పై వివాదం సృష్టించడం సిగ్గుచేటు : ఏపీ హోంమంత్రి

అమరావతి, ఫిబ్రవరి 3:జిన్నా టవర్ కు ప్రత్యేక స్థానం ఉందని, సైనికుల్లో అన్ని మతాలకు చెందిన వారుంటారని, దీనిపై వివాదం సృష్టించడం సిగ్గు చేటని ఏపీ హోంమంత్రి మేకతోటి సుచరిత అన్నారు. గుంటూరులో చారిత్రాత్మకమైన జిన్నాటవర్ ని బీజేపీ వివాదాస్పదం చేస్తోందని వైసీపీ నేతలు మండిపడుతున్న సంగతి తెలిసిందే. ఈసందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ?. వీరుల త్యాగంతోనే స్వేచ్ఛ అనుభవిస్తున్నామన్నారు. జాతీయ భావాన్ని పెంపొందించాల్సిన దేశ పాలకులు చిచ్చు పెట్టాలని చూడటం బాధాకరమన్నారు. జాతీయ స్థాయిలో పాలన చేస్తున్న బీజేపీ కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తుందన్నారు. ఇది సరైంది కాదని హోంమంత్రి సుచరిత అన్నారు.

# ఎం. స్టాలిన్‌ని కలిసిన తూర్పుగోదావరి జిల్లా యువకుడు

చెన్నై, ఫిబ్రవరి 3: తమిళనాడు సీఎం స్టాలిన్ రూటే సపరేటు..ప్రజా సమస్యలపై తనదైనశైలిలో స్పందిస్తున్నారు. కాగా రోడ్డు పక్కన సీఎం సర్ ప్లీజ్ హెల్ప్ మీ అనే ప్లకార్డుతో నిల్చున్నాడు ఓ యువకుడు. దాంతో ఆ యువకుడిని చూసిన స్టాలిన తన కాన్వాయ్ ని ఆపి యువకుడితో మాట్లాడారు. స్టాలిన్ తన నివాసం నుండి అసెంబ్లీకి వెళ్లే సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. స్టాలిన్, వాహనం దిగి స్వయంగా ఆ యువకుడితో మాట్లాడారు. ఆ యువకుడి వివరాలు తెలుసుకున్నారు.

కాగా, ఆ యువకుడి పేరు ఎన్. సతీశ్. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లాకు చెందినవాడు. ఇటీవల కొంతకాలంగా నీట్ విషయంలో సీఎం స్టాలిన్ కేంద్ర ప్రభుత్వంతో చేస్తున్న పోరాటానికి సతీశ్ కూడా ప్రభావితుడయ్యాడు. స్టాలిన్ ను ఈ విషయంలో అభినందించిన సతీశ్? దేశవ్యాప్తంగా నీట్ అభ్యర్థులకు మినహాయింపులు కల్పించేలా కేంద్రాన్ని ఒప్పించాలని స్టాలిన్ ను అర్థించాడు. దీనిపై స్టాలిన్ సానుకూలంగా స్పందించినట్టు తెలుస్తోంది. సోషల్ మీడియాలో దీనికి సంబంధించిన ఫోటోలు వైరల్ గా మారాయి.

# ముచ్చింతల్‌లో రెండో రోజు రామానుజాచార్య సహస్రాబ్ది వేడుకలు



హైదరాబాద్, ఫిబ్రవరి 3: ముచ్చింతల్ దివ్యక్షేత్రం దేశంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమానికి వేదికైంది. శ్రీ రామనుజాచార్యుల సహస్రాబ్ది సమారోహ ఉత్సవాలు, అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. 12 రోజుల ఈ మహాక్రతువులో తొలిరోజు శోభాయమానంగా జరిగింది. రెండో రోజు ఉత్సవాలు కన్నులపండువగా ప్రారంభమయ్యాయి. శ్రీ రామానుజ సహస్రాబ్ది ఉత్సవాల్లో భాగంగా అగ్నిమథనం పూర్తి అయింది. రెండో రోజు శ్రీ లక్ష్మి నారాయణ మహా క్రతువులో భాగంగా శమి, రావి కర్రలతో అగ్ని మథనం చేశారు.

తర్వాత అగ్నిహోత్రంతో 1035 కుండలాల్లో హోమం చేయనున్న రుత్వికులు.. ఇందుకోసం యజ్ఞ కుండలాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఏకకాలంలో 5 వేల మంది రుత్వికులతో 1035 కుండలాల్లో హోమాలు నిర్వహిస్తారు. ప్రవచన శాలలో వేద పండితులచే ప్రవచన పారాయణం ఉంటుంది. శ్రీరామానుజ సహస్రాబ్ది ఉత్సవాలకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు హాజరయ్యారు. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు పరిశీలించారు. కరోనా నిబంధనలు అమలవుతున్నాయో లేదో చూశారు.

# ఉద్యోగుల పోరాటం సఫలం కావాలి: శైలజానాథ్

అమరావతి, ఫిబ్రవరి 3: రాష్ట్రంలో ఉద్యోగులు చేస్తున్న పోరాటం సఫలం కావాలని ఏపీసీసీ చీఫ్ శైలజానాథ్ అన్నారు. మాయ మాటలతో జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చారని ఆయన ఆరోపించారు. అంకెల గారడీతో జీతాలు తగ్గించలేదని మళ్లీ మోసం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఉద్యోగుల ముందస్తు అరెస్ట్‌లు దుర్మార్గమన్నారు. జగన్‌రెడ్డి ఇచ్చిన హామీలను ఉద్యోగులు ప్రశ్నించడమే తప్పా అని ఆయన నిలదీశారు. ప్రభుత్వం చేసిన మోసంపై నిరసన తెలిపే హక్కు లేదా అని ఆయన ప్రశ్నించారు.



# సృజనాత్మక స్టార్ట్-అప్‌ల ద్వారా ఉదార నిధులు పొందడం కోసం డి ఎస్ టి నియమ నిబంధనలు సరళీకృతం చేస్తున్నట్లు మంత్రి వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:సైన్స్ టెక్నాలజీ సహాయ (స్వతంత్ర బాధ్యత) మంత్రి, ఎర్త్ సైన్సెస్ సహాయ (స్వతంత్ర బాధ్యత) మంత్రి , పిఎంఒ, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణు శక్తి , అంతరిక్ష శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ రోజు "బీటింగ్ రిట్రీట్' డ్రోన్ లైట్ షో "స్టార్ట్ అప్స్"ను సత్కరించారు, జనవరి 29 సాయంత్రం న్యూఢిల్లీ లోని విజయ్ చౌక్ లో రంగురంగుల త్రివర్ణ పతాకాన్ని వెలిగించడం ద్వారా యావత్ దేశాన్ని వారు మంత్రముగ్ధులను చేశారు.

''బోట్ లాబ్'' స్టార్ట్-అప్ సహ వ్యవస్థాపకులు, హర్యానాకు చెందిన సరితా అహ్లావత్, మధ్యప్రదేశ్ కు చెందిన తన్మయ్ బంకర్ , బీహార్ కు చెందిన అనుజ్ కుమార్ బర్న్వాల్, వారి ఇతర జట్టు సభ్యులతో పాటు 30 మంది హాజరయ్యారు. వారిని మంత్రి వ్యక్తిగతంగా సత్కరించి సన్మానించారు.

ఈ ప్రాజెక్టును చేపట్టిన ఆరు నెలల్లోనే వారు సాధించిన చారిత్రాత్మక ఘనతను అభినందిస్తూ, డాక్టర్ జితేంద్ర సింగ్ -దేశం వారి పట్ల గర్వపడుతోందని, వారిని గౌరవించడం ద్వారా, వాస్తవానికి ఇంత నమ్మశక్యం కాని యువ శాస్త్రీయ మెదడులను కనుగొన్నందుకు సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ తనను తాను అభినందించుకుంటున్నదని అన్నారు. దేశవ్యాప్తంగా దాగి ఉన్న సామర్థ్యాలను చేరుకోవడానికి , కనుగొనడానికి , తరువాత వారు ఎదగడానికి రాణించడానికి మద్దతు ఇచ్చే మంత్రిత్వ శాఖ కొత్త విధానాన్ని ఇది ఆవిష్కరిస్తున్నదని ఆయన అన్నారు.

సృజనాత్మక స్టార్ట్-అప్ లకు మద్దతు ఇవ్వడానికి ఒక రకమైన రివాల్వింగ్ ఫండ్ ను రూపొందించడానికి సమీకృత విధానాన్ని అభివృద్ధి చేయడానికి పరిశ్రమలను ఆకర్షించాలని డాక్టర్ జితేంద్ర సింగ్ సీనియర్ అధికారులను ఆదేశించారు. సృజనాత్మక స్టార్ట్-అప్ ల ద్వారా లిబరల్ ఫండింగ్ పొందడం కోసం డిపార్ట్ మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డిఎస్ టి)లో నియమనిబంధనలను సరళీకృతం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

సింగిల్ విండో క్లియరెన్స్, ప్రాజెక్టుల వేగవంతమైన ప్రాసెసింగ్, ఇంక్యుబేషన్ కోసం సౌకర్యాలు , స్టార్ట్-అప్ ల ద్వారా మ్యాచింగ్ నిధుల బాధ్యతను సమీక్షించడం వంటి సమస్యలను త్వరలో దేశంలో స్టార్ట్-అప్ ల పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహించడానికి నోటిఫై చేయనున్నట్టు డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.

నిన్న ఆమోదించిన కేంద్ర బడ్జెట్ ను ప్రస్తావిస్తూ, స్టార్ట్-అప్ ల ద్వారా "డ్రోన్ శక్తి"తో సహా డ్రోన్లకు ప్రాధాన్యత ఇవ్వడం , వ్యవసాయ రంగంలో కిసాన్ డ్రోన్లను ఉపయోగించడం భారతదేశాన్ని స్టార్ట్-అప్ పర్యావరణ వ్యవస్థ కు గ్లోబల్ హబ్ గా చేయాలనే ప్రధాని నరేంద్ర మోడీ దార్శనికతను నెరవేర్చడానికి తీసుకున్న చర్యలని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.

బీటింగ్ రిట్రీట్ వేడుక సందర్భంగా ఒక భారతీయ స్టార్ట్-అప్ -1,000 డ్రోన్లతో ఆకాశాన్ని వెలిగించే అత్యంత చర్చనీయాంశమైన , చాలా ప్రశంస పొందిన ప్రత్యేక ఘనతను సాధించగలదని బోట్ లాబ్ ప్రపంచానికి నిరూపించిందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఎస్ టి కార్యదర్శి డాక్టర్ ఎస్ చంద్రశేఖర్, కార్యదర్శి డాక్టర్ శేఖర్ మాండే, సెక్రటరీ సిఎస్ఐఆర్, డాక్టర్ రాజేష్ గోఖలే , బయోటెక్నాలజీ శాఖ కార్యదర్శి డాక్టర్ ఎం. రవిచంద్రన్, సెక్రటరీ, ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ ప్రొఫెసర్ అశుతోష్ శర్మ, మాజీ కార్యదర్శి, డి ఎస్ టి, రాజేష్ కుమార్ పాఠక్, టిడిబి కార్యదర్శి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

బోట్ లాబ్ డైనమిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి డాక్టర్ సరితాఅహ్లావత్ , డ్రోన్ షో సారథులు తన్మయ్ బంకర్, సుజిత్ రాణా, మోహిత్ శర్మ, హర్షిత్ బాత్రా, కునాల్ మీనా , మొత్తం ఇంజనీర్ల బృందం బోట్ లాబ్విజయోత్సవాన్ని జరుపుకోవడానికి పృథ్వీభవన్ వద్ద చేరారు. .

లడఖ్, ఈశాన్య స్టార్ట్-అప్ ల నుంచి వచ్చిన రెండు నిధుల ప్రతిపాదనలను టెక్నాలజీ డెవలప్ మెంట్ బోర్డు పరిశీలిస్తోందని మంత్రి తెలియజేశారు. స్టార్ట్-అప్ ల సుస్థిరతకు నిధుల ఉదార లభ్యత ఒక ముందస్తు షరతు అని, ఆ పరిశ్రమ కేంద్ర శాస్త్రీయ విభాగాలతో భాగస్వామ్యం వహించాలని ఆయన అన్నారు.

బోట్ లాబ్ డైనమిక్స్ కు పరిశోధన. అభివృద్ధి కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్ మెంట్ (డిఎస్ టి) రూ.కోటి రూపాయల ప్రాథమిక విత్తన నిధిని , తరువాత స్కేల్ అప్ , వాణిజ్యకరణ కోసం భారతదేశంలో మొట్టమొదటి టెక్నలాజికల్ ప్రాజెక్టు అభివృద్ధి చేయడానికి టెక్నాలజీ డెవలప్ మెంట్ బోర్డు రు. 2.5 కోట్ల రూపాయలు ఇచ్చింది.

కార్యదర్శి డిఎస్ టి , చైర్ పర్సన్, టిడిబి మాట్లాడుతూ '' రాబోయే సంవత్సరాల్లో స్వదేశీ టెక్నాలజీల వాణిజ్యకరణను ప్రారంభించడంలో టిడిబి ఒక ముఖ్యమైన పాత్రను కొనసాగిస్తుందని , ప్రస్తుత నాయకత్వంలో బహుళ రెట్లు పెరుగుతుందని విశ్వసిస్తున్నాను" అని అన్నారు. స్టార్ట్-అప్ లకు మద్దతు ఇవ్వడంలో టిడిబి కూడా గణనీయమైన పాత్ర పోషిస్తుంది. ,వారు ఎదగడానికి ఆత్మనిర్భర్ భారత్ మిషన్ కు కూడా దోహదపడుతుంది.

టిడిబి కార్యదర్శి రాజేష్ కుమార్ పాఠక్ మాట్లాడుతూ, "బోట్లాబ్ డైనమిక్స్ యొక్క ఈ యువ డ్రీమర్ల కలలకు మద్దతు ఇవ్వడం టిడిబి కి గర్వంగా ఉంది, వారి వ్యవస్థాపకులు డాక్టర్ సరితాఅహ్లావత్, శ్రీ తమ్మయ్ బంకర్ ,శ్రీ అనుజ్ కుమార్ బర్న్వాల్ నాయకత్వం లో

1000 డ్రోన్లతో ఆకాశాన్ని వెలిగించి, ,అద్భుతమైన డ్రోన్ లైట్ షోను ప్రదర్శించడం ద్వారా భారత్ ను ప్రపంచంలో ఈ ఘనతను సాధించిన 4వ దేశంగా నిలబెట్టారనీ అన్నారు.

బోట్ లాబ్ సహ వ్యవస్థాపకుడు సరితాఅహ్లావత్ మాట్లాడుతూ, బోట్ లాబ్ మొత్తం స్టార్టప్ అప్ బృందం కీలకమైన సమయంలో ఆర్థిక మద్దతు ఇచ్చినందుకు సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, టెక్నాలజీ డెవలప్ మెంట్ బోర్డు, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం , ఐఐటి ఢిల్లీలకు కృతజ్ఞతలు తెలుపుతోందని చెప్పారు. రిపబ్లిక్ డే రిట్రీట్ వేడుకలో డ్రోన్ షో కలను విజయవంతంగా , భావనాత్మకంగా రూపొందించగలగడానికి సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ లోని వివిధ సంస్థల నుంచి అందిన ఆర్థిక సహాయమే కారణం అని ఆయన చెప్పారు.

# కర్ణాటకలో స్వచ్ఛభారత్ మిషన్ విజయగాధ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:పరిశుద్ధ భారతావని లక్ష్యంగా భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛభారత్ పథకం అమలులో ఇది మరో విజయగాధ. కర్ణాటక రాష్ట్రం, ఉడుపి జిల్లా,.. కారకాల తాలూకాలోని నిట్టె గ్రామంలో సాధించిన విజయం. రీసైక్లింగ్ చేయాల్సిన పొడి వ్యర్థ పదార్థాల సేకరణలో నిట్టీ పంచాయతీ పరిధిలోని మెటీరియల్ రికవరీ కేంద్రం (ఎం.ఆర్.ఎఫ్.),.. ఎంతో సమర్థంగా పనిచేసింది. 2021 ఆగస్టు ఒకటవ తేదీన పనులు ప్రారంభించిన ఈ కేంద్రం,.. కారకాల, ఉడుపి, కవుప్, హెబ్రి బ్లాకుల పరిధిలో ఉన్న 41 గ్రామ పంచాయతీలకు సంబంధించిన వ్యర్థాల తొలగింపు ప్రాజెక్టు పనులను ఎంతో సమర్థంగా నిర్వహించింది.

ఉడుపి జిల్లా పంచాయత్ పర్యవేక్షణలో ఈ ప్రక్రియను నిర్వహించారు. వ్యర్థాల నిర్వహణా సేవలందించే సాహస్ జీరో వేస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ,.. ఈ ప్రాజెక్టు అమలుకు సాంకేతిక మార్గదర్శకత్వం వహించింది. మంగళూరుకు చెందిన మంగళా రిసోర్స్ మేనేజిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఎం.ఆర్.ఎఫ్. తన పనులు నిర్వహించింది.

నిర్వహణా ప్రక్రియ: ప్రాజెక్టు అమలుచేసే ప్రాంతం పరిధిలో ఇళ్ల ముంగిటినుంచి సేకరించిన వ్యర్థాలను నేరుగా ఘనవ్యర్థాల నిర్వహణ (ఎస్.డబ్ల్యు.ఎం.) కేంద్రాలకు తీసుకవస్తారు. ఇక్కడ వ్యర్థాలను బరువు తూచి, ప్యాక్ చేసి ప్రతివారం వాహనంలో నింపి ఎం.ఆర్.ఎఫ్ కేంద్రానికి పంపిస్తారు. కేంద్రానికి చేరుకున్న తర్వాత సదరు వ్యర్థాలను మరోసారి బరువు సరిచూసి గిడ్డంగుల్లో ఏర్పాటు చేసిన అరల్లో నిల్వచేస్తారు.

ఆ తర్వాత సదరు వ్యర్థాలను కన్వేయర్ బెల్ట్ సాయంతో 25నుంచి 30 విభాగాలుగా విభజిస్తారు. ఇలా వర్గీకరించిన వ్యర్థాలను బెయిలింగ్ యంత్రాల ద్వారా ఒత్తిడితో అణచివేసి బ్లాకులుగా తయారు చేస్తారు. ఇలాంటి వ్యర్థాలను అధీకృత రీసైక్లింగ్ కంపెనీలకు విక్రయిస్తారు. ఇక రీసైక్లింగ్ ప్రక్రియకు వీలుగాని వ్యర్థాలను కో-ప్రాసెసింగ్ కోసం సిమెంట్ ఫ్యాక్టరీలకు రవాణా చేస్తారు.

ఎం.ఆర్.ఎఫ్. కేంద్ర సామర్థ్యం: ఈ పనులు నిర్వహించే ఎం.ఆర్.ఎఫ్. యూనిట్.కు 1,000 చదరపు అడుగుల విస్తీర్ణంతో కూడిన భవనం ఉంది. రోజుకు పది టన్నుల వ్యర్థాల సమస్యను పరిష్కరించే సామర్థ్యం ఈ యూనిట్.కు ఉంది. వ్యర్థాల నిల్వకు, వర్గీకరణకు, బెయిలింగ్ విభాగాలకు అవసరమైన స్థలం కూడా ఈ యూనిట్.కు అందుబాటులో ఉంది. దీనికి తోడుగా, కార్యాలయం, సెక్యూరిటీ గది, విశ్రాంతి గది, మరుగుదొడ్డి సౌకర్యం కూడా ఉంది. ఇంకా, కన్వేయర్ బెల్టు, బెయిలింగ్ మెషీన్, స్టేకర్, అగ్నిమాపక సదుపాయం, ఒక జనరేటర్, సి.సి.టి.వి., 70 టన్నుల సామర్థ్యంతో వాహనాల బరువును తూచే బ్రిడ్జి, 7 టన్నుల సామర్థ్యం కలిగిన ఒక ట్రక్కు ఈ రికవరీ కేంద్రం పరిధిలో ఉన్నాయి.

సేవా రుసుములు (సర్వీస్ చార్జీలు): ఈ రికవరీ యూనిట్ కోసం ప్రత్యేకంగా ఒక బ్యాంక్ ఖాతాను నిట్టే గ్రామ పంచాయతీ నిర్వహిస్తూవస్తోంది. వ్యర్థాల నిర్వహణకోసం తాము చెల్లించాల్సిన సర్వీసు చార్జీలను వివిధ గ్రామ పంచాయతీలు ఈ ఖాతాకు జమచేయాల్సి ఉంటుంది; ఈ ఖాతాకు సంబంధించి సంతకం చేసే అధికారం ఛైర్మన్ లేదా, సభ్య కార్యదర్శికి ఉంటుంది. ప్రతి నెలా ఐదవ తేదీలోగా ఎం.ఆర్.ఎఫ్. నిర్వాహకులు తన ఇన్వాయిస్ బిల్లును వివిధ గ్రామ పంచాయతీల ఉమ్మడికి కమిటీకి సమర్పిస్తారు. ఈ బిల్లుల ఆధారంగా గ్రామ పంచాయతీలు తాము చెల్లించాల్సిన సర్వీసు చార్జీల మొత్తాన్ని జాయింట్ కమిటీకి చెందిన బ్యాంకు ఖాతాకు జమచేయాల్సి ఉంటుంది. తమకు ఇన్వాయిస్ బిల్లు అందిన వారం రోజుల్లోగా సర్వీసు చార్జిని బ్యాంకు ఖాతాకు జమచేయాల్సి ఉంటుంది.

వ్యర్థాలను వివిధ భాగాలుగా విభజించడం, సేకరించడం తదితర ప్రక్రియలపై సమాచారాన్ని,. ఇళ్ల యజమానులకు, వాణిజ్య సంస్థల యజమానులకు, వ్యర్థాలకు కారకులయ్యే ఇతరులకు గ్రామ పంచాయతీలే తమ సొంత ఖర్చుతో తెలియజేయాల్సి ఉంటుంది.

ఇళ్లనుంచి వచ్చే తడి వ్యర్థాల, హానికరమైన వ్యర్థాల నిర్వహణ గ్రామ పంచాయతీ స్థాయిలోనే జరగాల్సి ఉంటుంది.

తమ తమ పరిధుల్లో సేకరించిన వ్యర్థాలను విభజించడం. వ్యర్థాలు దుర్వాస రాకుండా నివారించేందుకు వాటిని పొడి కేంద్రాల్లో నిల్వచేయడం, అనంతరం ఎం.ఆర్.ఎఫ్. వాహనంలోకి బట్వాడా చేయడం.

గ్రామ పంచాయతీ స్థాయిలో సేకరించిన వ్యర్థాలను సంచుల్లో నింపేయాలి.

వ్యర్థాలను డంప్ చేయకుండా నివారించేందుకు సత్వర రవాణాకు ఒక వాహనాన్ని అందుబాటులో ఉంచాలి.

పెద్ద పరిణామాణంలోని వ్యర్థాలను ఎం.ఆర్.ఎఫ్. యూనిట్ సేకరించాల్సిన అవసరం ఉందని గ్రామ పంచాయతీ గనుక భావించిన పక్షంలో, ఆ విషయాన్ని రెండురోజులు ముందుగా ఎం.ఆర్.ఎఫ్. యూనిట్ నిర్వాహకులకు తెలియజేయాల్సి ఉంటుంది.

ఎం.ఆర్.ఎఫ్. నిర్వాహకులకు సకాలంలో సర్వీసు చార్జిని చెల్లించాల్సి ఉంటుంది. సేకరించే వ్యర్థాలు ఊహించిన దానికంటే తక్కువ పరిమాణంలో ఉన్న పక్షంలో సర్వీసు చార్జీలో 50శాతాన్ని చెల్లించాల్సి ఉంటుంది.

నిధుల సాయం: గ్రామీణ ప్రాంతాలకు ఉద్దేశించిన స్వచ్ఛ భారత్ పథకం పరిధిలో ఈ ప్రాజెక్టుకోసం రూ. 2కోట్ల 50 లక్షలను వినియోగించారు; అంటే,.. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ. 8.32లక్షలను, 15 ఆర్థిక సంఘం పథకం కింద రూ. 28.35లక్షలను గ్రామ వికాస్ నిధి కింద రూ. 10లక్షలను, నిట్టే పంచాయతీ సొంత నిధి కింద రూ. 23 లక్షలను ఈ ప్రాజెక్టుకోసం వినియోగించారు.

ప్రాజెక్టును విస్తృతం చేసే ప్రణాళిక: ఈ ప్రాజెక్టును మరింత విస్తృతం చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. బుడగబెట్టు, కేదూరు, త్రాసి, హెబ్రి ప్రాంతాల్లో 4 ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణా కేంద్రాలను (పి.డబ్ల్యు.ఎం.యు.లను) ఏర్పాటుకోసం అవసరమైన ప్రణాళికలను ఇప్పటికే రూపొందించారు. మిగిలిన 144 గ్రామ పంచాయతీల్లో వ్యర్థాల నిర్వహణ చేపట్టేందుకు వీలుగా ఈ కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నారు.

# రైల్వే ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం -నిందితుని నుండి 1కోటి, 27 లక్షల రూపాయలు సీజ్

అమరావతి, ఫిబ్రవరి 3:రైల్వే ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి పలువురిని మోసగించిన కేసులో .. అరగొండ గ్రామానికి చెందిన హేమంత్ కుమార్ ని అరెస్టు చేశారు చిత్తూరు ఒన్ టౌన్ పోలీసులు. హేమంత్ కుమార్ రైల్వేఉద్యోగినని చెప్పుకుంటూ, ఉన్నతాధికారుల సంతకాలను చేస్తూ , అపాయింట్మెంట్ ఇస్తూ పలువురిని మోసం చేశాడు. కాగా నిందితుని తండ్రి ఇదివరకు రైల్వే ఉద్యోగం చేసేవాడు . ఆ సంబంధాలతో ఉద్యోగుల ఇప్పిస్తానని చెప్పి జిల్లాలో పలువురిని మోసం చేశాడు. నిందితుని నుండి 1కోటి, 27 లక్షల రూపాయలు సీజ్ చేశారు పోలీసులు..చిత్తూరు డి ఎస్పీ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ .ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. నిందితుని మీడియా ముందుకు తీసుకువచ్చారు.




# సీఎం అభ్యర్థిని రాహుల్ ప్రకటిస్తారు: పంజాబ్ సీఎం చన్నీ

చండీగఢ్, ఫిబ్రవరి 3:: పంజాబ్ కాంగ్రెస్ ముఖ్యమంత్రి అభ్యర్థిని ఫిబ్రవరి 6న కాంగ్రెస్ ముఖ్య నేత రాహుల్ గాంధీ ప్రకటిస్తారని ముఖ్యమంత్రి చరణ్‌జిత్ సింగ్ చన్నీ ప్రకటించారు. ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించే సమయంలో తాను రాహుల్‌తో పాటే ఉంటానని ఆయన పేర్కొన్నారు. గురువారం చాంకూర్ సాహిబ్‌ని సందర్శించిన అనంతరం చన్నీ ఈ ప్రకటన చేశారు. కాంగ్రెస్ తరపున ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరని పంజాబ్‌తో పాటు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ప్రస్తుతం జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్ తర్వాత పంజాబే కీలకంగా ఉంది.

అయితే యూపీలో ఎస్పీ తరపున అఖిలేష్, బీఎస్పీ తరపున మాయావతి, బీజేపీ తరపున యోగి ముఖ్యమంత్రి అభ్యర్థులుగా ఉన్నారు. ఇక కాంగ్రెస్ తరపున యూపీలో ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించా ల్సిన అవసరం లేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కారణం యూపీలో కాంగ్రెస్ సింగిల్ డిజిట్ సీట్లు దాడటం కష్టమనే అభిప్రాయం బలంగా ఉంది.ఇవి కూడా చదవండిఎఎజీణవ అజీజూబితీనీనికాంగ్రెస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్లే: కేజ్రీవాల్ప్రస్తుతం ఎన్నికలు జరగబోయే రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉండి ఎన్నికలకు పోతున్న ఏకైక రాష్ట్రం పంజాబ్ కావడం వల్ల పంజాబ్ కాంగ్రెస్ ముఖ్యమంత్రి అభ్యర్థిపై ఎక్కువ ఆసక్తి నెలకొంది.

యూపీ కాకుండా ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ బలంగానే ఉన్నప్పటికీ మాజీ సీఎం హరీష్ రావత్ పార్టీకి సర్వాధికారిగా ఉన్నారు. ఇక గోవా, మణిపూర్ రాష్ట్రాలపై పెద్దగా చర్చ ఉండదు. పంజాబ్ ముఖ్యమంత్రిగా అమరీందర్ తప్పకుని కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రముఖంగా రెండు ముఖాలు కనిపిస్తున్నాయి. ఒకరు సీఎం చన్నీ కాగా, మరొకరు పంజాబ్ కాంగ్రెస్ చీఫ్ నవజ్యోత్ సింగ్ సిద్ధూ. మళ్లీ సీఎం చన్నీనే అని కొందరు, లేదు సిద్ధూని ప్రకటిస్తారని మరికొందరు అంటున్నారు. ఈ నేపథ్యంలో పంజాబ్ పోలింగ్‌కు ముందే సీఎం అభ్యర్థిని ప్రకటన వస్తుందని చెప్పి ఈ చర్చకు ముగింపు పలకాలని కాంగ్రెస్ భావిస్తున్న క్రమంలోనే ఫిబ్రవరి 6న కాంగ్రెస్ తరపు ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.

# ఢిల్లీలో బండి సంజయ్ మౌన దీక్ష..



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ ఢిల్లీ తెలంగాణ భవన్ లో మౌన దీక్ష చేపట్టారు. ముందుగా ఢిల్లీ తెలంగాణ భవన్ లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బండి సంజయ్ తెలంగాణ భవన్ లోనే ఒక గంట పాటు దీక్ష కు కూర్చున్నారు. నోటికి నల్ల బ్యాడ్జీలు కట్టుకొని నిరసన దీక్ష చేపట్టారు. అలాగే తెలంగాణ బీజేపీ ఆఫీసులో బీజేపీ నేతలు లక్ష్మణ్, రాజాసింగ్ లు, మండల కేంద్రాల్లో బీజేపీ నేతలు దీక్షలకు కూర్చున్నారు.

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ .. భారత రాజ్యంగంపై చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎం కేసీఆర్ క్షమాపణలు చెప్పాల్సిందేనని బీజేపీ డిమాండ్ చేస్తోంది. అంతేకాకుండా టీఆర్ఎస్ ప్రభుత్వంపై దశలవారీగా ఉద్యమాలు చేపట్టేందుకు ప్రణాళికలు సైతం సిద్ధం చేస్తోంది. అందులో భాగంగానే తెలంగాణ బీజేపీ చీఫ్ బండి సంజయ్ ఈ రోజు ఢిల్లీలో మౌన దీక్ష చేపట్టారు. బీజేపీ భీమ్ దీక్ష పేరుతో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్నారు.

# చర్చల ద్వారానే సమస్యలకి పరిష్కారం- హోంమంత్రి సుచరిత



అమరావతి, ఫిబ్రవరి 3:గుంటూరు జిన్నాటవర్ సెంటర్ వద్ద జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు ఏపీ హోంమంత్రి మేకతోటి సుచరిత తెలిపారు. ఉద్యోగుల ఛలో విజయవాడపై ఆమె స్పందించారు. చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. చర్చలకు అవకాశం ఇవ్వలేదనడం అబద్ధమని.. హౌస్ అరెస్టులు లేవని, అనుమతి లేని సభకు వెళ్లొద్దని చెప్పామన్నారు. ఉద్యోగులు సహకరించాలని సీఎం జగన్ చెప్పారని.. ఉద్యోగులకు మేలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా వుందని హోంమంత్రి స్పష్టం చేశారు. కరోనాతో రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నాయని ఆమె అన్నారు.

ఎందరో మహానుభావులు చేసిన త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను అనుభవిస్తున్నామని సుచరిత వ్యాఖ్యానించారు. గుంటూరు నగరంలో జిన్నా టవర్ కు చాలా ప్రత్యేక స్థానం ఉందని.. జిన్నా టవర్ కట్టే సమయానికి ఇక్కడ చాలా మంది పుట్టి వుండరని ఆమె అన్నారు. స్వాతంత్ర్యానికి ముందు భారత ప్రజల ఐక్యతకు చిహ్నంగా జిన్నా టవర్ ను నిర్మించారని సుచరిత గుర్తుచేశారు. భారత సరిహద్దుల్లో వీర జవాన్ లు కాపలా ఉండటం వలనే మనమందరం ప్రశాంతంగా నిద్రపోగలుగుతున్నామన్నారు. జిన్నా టవర్ విషయాన్ని బీజేపీ రాజకీయ లబ్ది కోసం వాడుకోవాలని చూడటం బాధాకరం, సిగ్గుచేటన్నారు. మానవాళికి మంచి చేసిన వారిని స్మరించుకోవడం మన భారతీయులకు అలవాటని చెప్పారు.

# సీఎంతో సజ్జల, సీఎస్ భేటీ..ఛలో విజయవాడపై ఆరా

అమరావతి, ఫిబ్రవరి 3: ఉద్యోగుల ఛలో విజయవాడ విజయవంతం అయిన నేపథ్యంలో ఏపీ సీఎం జగన్ తో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, సీఎస్ సమీర్ శర్మ సమావేశం అయ్యారు. ఈ భేటీలో వైస్సార్సీపీ అగ్రనేత, టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కూడా పాల్గొన్నారు. కాగా, ఛలో విజయవాడ కార్యక్రమం గురించి సీఎం జగన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగుల డిమాండ్లు, పెన్ డౌన్, సమ్మె తదితర కార్యాచరణలపై సజ్జల తదితరులతో చర్చించారు.

కాగా, ఈ సాయంత్రం 6 గంటలకు సీఎస్ సమీర్ శర్మ మీడియా సమావేశం ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది. సీఎం జగన్ తో చర్చించిన విషయాలపై ఈ ప్రెస్ మీట్ లో మాట్లాడే అవకాశాలు ఉన్నాయి. కొంతకాలంగా తమ డిమాండ్ల కోసం ఉద్యమిస్తున్న ఏపీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు నేడు భారీ ఎత్తున విజయవాడ తరలిరావడం తెలిసిందే. ప్రభుత్వ ఆంక్షల నేపథ్యంలో 'ఛలో విజయవాడ' కార్యక్రమాన్ని అనూహ్య రీతిలో విజయవంతం చేశారు.

# ఉద్యోగులందరూ మా కుటుంబసభ్యులే: డిప్యూటీ సీఎం నారాయణ స్వామి

అమరావతి, ఫిబ్రవరి 3: రాష్ట్రంలోని ఉద్యోగులు అందరూ తమ కుటుంబసభ్యులేనని సీఎం, మంత్రులు చెబుతున్నారని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి అన్నారు. చర్చల విషయంలో ఇప్పటికైనా మించిపోయింది లేదన్నారు. ఉద్యోగులు చర్చలకు రావాలని, ఉద్యోగస్తులకు సీఎం మంచి చేస్తారని ఆయన పేర్కొన్నారు. సీఎంనే కలవాలని ఉద్యోగులు ఎలా అంటారని ఆయన ప్రశ్నించారు. మంత్రుల కమిటీతో మాట్లాడితే ఆ వివరాలు వారే సీఎంకు చెబుతారని ఆయన తెలిపారు. ఉద్యోగుల ఉద్యమం వెనుక చంద్రబాబు ఉన్నారని ఆయన ఆరోపించారు.

# ముఖ్యమంత్రి బేషరతుగా క్షమాపణ చెప్పాలి



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 3:(నేటినిజం ప్రతినిధి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు శ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాజ్యాంగాన్ని మార్చాలంటూ తెలంగాణ ముఖ్యమంత్రి కెచంద్రశేఖర్రావు చేసిన వ్యాఖ్యల కు నిరసనగా అలాగే డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అగర్వ పరచడని ఖండిస్తూ వేములవాడ నియోజవర్గం ఎమ్మార్పీఎస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కెసిఆర్ దిష్టిబొమ్మను దహనంచేస్తుండగా పోలీసు యంత్రాంగం అడ్డుకున్నారుడాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం లో బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీలు వందకోట్ల జనాభా నాలుగు మెతుకులు తింటూ ఉన్నారంటే అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగమే తెలంగాణ రాష్ట్రం రావడానికి అంబేద్కర్ రాసిన ఆర్టికల్ 3 ప్రకారమే అమలైంది రెండు సార్ల కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాడంటే అంబేద్కర్ పెట్టిన బిక్ష వలనే అలాంటి వ్యక్తిని అవమానపరిచి కించపరిచిన కెసిఆర్ వెంటనే దళిత సమాజానికి అంబేద్కర్కు బేషరతుగా క్షమాపణ చెప్పాలనిఒకవేళ క్షమాపణ చెప్పకపోతే రాష్ట్ర వ్యాప్తంగా 10 తారీకు వరకు ఆందోళన చేస్తామని నాయకులు డిమాండ్ చేశారు

ఇట్టికార్యక్రమంలోఎమ్మార్పీఎస్ ఎం ఎస్ పి నాయకులు అవునురి ప్రభాకర్ గుండా థామస్ కానాపురం లక్ష్మణ్ తాండ్ర తిరుపతి ఆవునూరి లచ్చన్న నెదురి నరసయ్య సాముల ప్రతాప్ నరేష్ నాయక్ లంబాడి హక్కుల సమితిరమేష్ నాయక్ మ్యాకల లచ్చయ్య రోమాల కుమార్ మ్యాకల జీవన్ తదితరులు పాల్గొన్నారు

# భార్యపై కత్తితో దాడి చేసిన భర్త.. పరిస్థితి విషమం..

అమరావతి, ఫిబ్రవరి 3: భార్యపై భర్త కత్తితో దాడి చేసిన దారుణ ఘటన ప్రకాశం జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ప్రకాశం జిల్లా దర్శి మండలం పోతవరం గ్రామానికి చెందిన పావని, పచ్చలమెట్ట ప్రాంతానికి చెందిన శింగంశెట్టి సాయి కొంతకాలం క్రితం ప్రేమించుకున్నారు. అయితే పెళ్లికి పెద్దలు ఒప్పుకోలేదు, దీంతో ఇరు కుటుంబాలను ఒప్పించిన వీరు నాలుగు నెలల క్రితం పెళ్లి చేసుకున్నారు. ఇదిలా ఉండగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో పావని తల్లి ఇంటికి వెళ్లి ప్రస్తుతం కాకినాడలో బీటెక్ చదువుతోంది.

ఈ నేపథ్యంలో పావనిని తల్లిదండ్రులు భర్త వద్దకు పంపేందుకు నిరాకరించగా సాయి మనోవేదనకు గురై పోతవరం వెళ్లాడు. అక్కడ భార్యతో వాగ్వాదానికి దిగి కత్తితో దాడి చేశాడు. అంతేకాకుండా అత్తపై కూడా దాడి చేసి అక్కడి నుంచి పారిపోయాడు. బాధితులు కేకలు వేయడంతో స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని పావని తోపాటు, ఆమె తల్లిని మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మీ కోసం

మీకోసం

మీ కోసం

నేటినిజం లో..

## 'స్వీయ పరిచయవేదిక' త్వరలో...

వారం, వారం వర్ధమానులు, ప్రవర్ధమానులు తమ రచనల్ని అందించడానికి అనువైన పత్రికగా భాసిల్లుతున్న 'నేటినిజం" మరో కొత్త శీర్షికకు త్వరలో శ్రీకారం చుట్టబోతోంది. అనేక మంది కవులు, కవయిత్రులు తమ సాహితీ ప్రస్థానాన్ని 'నేటినిజం' స్వాగత తోరణం ద్వారానే ప్రవేశించిన వారున్నారు. ప్రసిద్ధులుగా తమ రచనల ద్వారా పాఠకుల హృదయాల్లో చోటు చేసుకున్న వారం సైతం చాలా మంది క్రమం తప్పకుండా పత్రికను ఆదరించి, ఆశీర్వదిస్తున్నారు.

కొత్తగా కలంపట్టే వారికి ప్రేరణనందించే విధంగా ప్రసిద్ధ కవులు, రచయితలు తమ రచనల ద్వారా 'నేటినిజం'లో ప్రేరణనందించడాన్ని చూస్తున్నాం. సాహిత్య సృజన చేస్తున్న కవులు, కవయిత్రులు, రచయితలు, రచయిత్రులను పరిచయం చేసేందుకు లోగడ 'నేటినిజం' ద్వారా విశేష కృషి జరిగిన విషయం మీకు తెలిసిందే.. ఇదే క్రమంలో కలం పట్టి సామాజిక చైతన్యానికి కృషి చేస్తున్న సృజనకారులు తమకు తామే స్వీయ పరిచయం చేసుకునేందుకు.. 'నేటినిజం' ముందుకు రాబోతున్నది. 'స్వీయ పరిచయ వేదిక' అన్న శీర్షికతో ప్రతివారం సాహితీ కెరటాల ద్వారా అందించాలని సంకల్పిస్తున్నాం..

*ఈ సందర్భంగా దిగువ సూచనలు గమనించి తమ పరిచయాన్ని తామే పంపించగలరని కోరుతున్నాం..*

**సూచనలు:**

**1)** ఇదివరకే తమ రచనల ద్వారా సాహితీ లోకానికి కవులుగా, రచయితలుగా, పరిచయమున్నప్పటికీ.. మీ, మీ మాటల్లోనే మీ గురించి రాసిన పరిచయ వాక్యాలను ఇంకా సమగ్రంగా సాహితీ బంధువులకు తెలియజేసే ఉద్దేశంతో ప్రారంభించబడుతున్న శీర్షిక ఇది. కనుక వాస్తవ విషయాలనే ప్రస్తావిస్తారన్న విశ్వాసముంది. వాస్తవాలనే పంపాలన్న సంగతి చెప్పాల్సిన అవసరం లేదు.

**2)** పేరు, వృత్తి, చిరునామా.. ఇత్యాది విషయాలను మొదట పేరాలో మీకు మీరే పరిచయం చేసుకోవాలి.

**3)** రచనా వ్యాసంగంలోకి కవిగా, రచయితగా ప్రవేశించిన సం॥... తమ తొలి రచన.. ఇత్యాది వివరాలు సంక్షిప్తంగా రాయాలి.

**4)** సాహితీ లోకంలో సృజనకారులుగా అడుగులు వేయడానికి మీకు ప్రేరణనిచ్చింది ఎవరు? వారికి సంబంధించి మీకు ఏ రచన ప్రభావితం చేసింది? వివరాలు సంక్షిప్తంగా రాయాలి.

**5)** ఇప్పటి వరకు రాసిన కవితలసంఖ్య, వ్యాసాల సంఖ్య, కథలు.. ఇతరత్రా ప్రక్రియల్లో మీరు ప్రదర్శిస్తున్న ప్రతిభకు సంబంధించిన వివరాలు-సంక్షిప్తంగా..

**6)** మీరు వెలువరించిన గ్రంథాలు.. ప్రక్రియలు.. ఏయే సంవత్సరాల్లో.. తదితర వివరాలు.. పుస్తకాల పేర్ల జాబితాను పొందుపరచాలి.

**7)** మీరు పొందిన సాహిత్య పురస్కారాలు.. లిస్ట్ పొందు పరువచ్చు. పొందుపరిచే క్రమంలో.. ముఖ్యమైన వాటినే ప్రస్తావించాలి.

**8)** మీరు పొందిన బిరుదులు-వివరాలు-అందించిన సంస్థలు-వాటి వివరాలు

**9)** మీరు రచించిన కవితల్లో/ కథల్లో/ రచనల్లో మీకు బాగా నచ్చింది ఏమిటి? వివరాలు సంక్షిప్తంగా పొందుపరచవచ్చు.

**10)** మీరు పాల్గొన్న సభల్లో మీకు బాగా నచ్చిన సభ.. వివరాలు అందించండి.

**11)** ప్రసిద్ధ కవులు-రచయితలతో సభను పంచుకున్న సభలనూ వివరించవచ్చు.

**12)** మీ ద్వారా సాహితీకారులకు పురస్కారాలు అందిస్తే వివరాలు తెల్పండి.

**13)** మీరు ఏదైనా పత్రికకు కాలమిస్టుగా వ్యవహరిస్తే.. వివరాలు రాయాలి.

**14)** మీరు వెలువరించిన గ్రంథాలకు సంబంధించిన గ్రంథాల టైటిల్ పేజీలను మీకు ఇష్టమైన వాటిని **ఐదు**కు మించకుండా పంపాలి.

**15)** మీ సాహిత్య ప్రస్థానంలో మీరు పాల్గొన్న సభలకు సంబందించిన ఫోటోలు ఉంటాయి. వాటిలో కూడా అతి ముఖ్యమైన వాటిని ఎంపిక చేసుకుని **ఐదింటి**ని మాత్రమే పంపాలి.

**16)** మీ రచనలపై ఏ విశ్వ విద్యాలయంలోనైనా పాఠ్యాంశాలుగా నిర్ణయింపబడితే వాటి వివరాలు ఇవ్వండి.

**17)** మీ రచనలపై ఏ విశ్వవిద్యాలయంలోనైనా పరిశోధనలు జరుగుతున్నట్లయితే వివరాలు.. అందించండి..

**18)** సాహిత్య సంస్థల నిర్వహణలో మీకున్న భాగస్వామ్యం వివరాలు-

**19)** ఇప్పుడొస్తున్న కవిత్వం/ కథలు/ ఇతర సాహిత్యంపై మీ అభిప్రాయం.

**20)** మంచి కవిత్వానికి/ కథకు/ రచనకు ఉండాల్సిన లక్షణాలు.. ఎలా ఉండాలని కోరుకుంటున్నారు?

**21)** ఇప్పుడొస్తున్న అంతర్జాల కవిత్వ సమూహాలు.. కవిత్వ సృజన జరుగుతున్న తీరు తెన్నులపై మీ అభిప్రాయం.

**22)** ఆధునిక సమాజంలో ఏ విధమగు సాహిత్యం/ కవిత్వం/ కథలు రావాలని కోరుకుంటున్నారు?

**23)** మీ లేటెస్ట్ పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటో పంపాలి.

*పై అంశాల్లో మీకు సంబంధించిన వివరాలు ఉంటేనే మీ పరిచయ వ్యాసంలో పొందుపరచాలి. సంబంధం లేని అంశాలను వదిలేయాలి.. 'ఏమీ లేవు' అని పేర్కొనవలసిన అవసరం లేదు.*

*వివాదాస్పదమైన విషయాలను రచనలను అసలే ప్రస్తావించకూడదన్న విషయం మీకు తెలియందికాదు.*

*స్వీయ పరిచయానికి సంబంధించి మీరు ఇంకేమైనా ప్రస్తావించ దలుచుకుంటే ప్రస్తావించవచ్చు.*

*మీ పరిచయం వ్యాసం మూడు అరతావులకు మించకూడదు.*

*బాగా ఆలోచించాకే విశేషాల వివరాలు పొందుపరచాలి. మళ్లీ మార్పులు-చేర్పులు చేయడానికి వీలుండదు.*

*'నేటినిజం'లో మీ పరిచయాన్ని ముద్రించే విషయంలో తుది నిర్ణయం సంపాదకులదే..*

*ఏ విధమైన ఉత్తర ప్రత్యుత్తరాలకు.. ఫోన్ సంప్రదింపులకు అవకాశం లేదు.*

*వీలు వెంబడి క్రమంగా ఒక్కోవారం ఒక్కో సృజనకారుని పరిచయం ప్రచురించడం జరుగుతుంది. మీ వంతు వచ్చేవరకు వేచి ఉంటారన్న విశ్వాసముంది.*

***ఇంకా ఆలస్యం దేనికి?***

పై సూచనలు పాటిస్తూ మీ పరిచ వ్యాసం రాసి పంపండి..

**E-mail : netinizam2020@gmail.com**

- బైస దేవదాసు
సంపాదకులు: 'నేటినిజం'


# ఒకో మారెట్‌కు రూ.4.50 కోట్లు కేటాయింపు

## -రాష్ట్ర రవాణాశాఖ మంత్రి అజయ్‌కుమార్

ఖమ్మం ఫిబ్రవరి3 : ఖమ్మం నగరంలో మరో వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్లు అందుబాటులోకి రానున్నాయని, శరవేగంగా పనులు పూర్తవుతున్నాయని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన నగర మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, మేయర్ పునుకొల్లు నీరజతో కలిసి నిర్మాణాలను పరిశీలించారు. ఆదేశించారు. అన్ని వైపులా మార్కెట్లకు రోడ్లు అనుసంధానం చేయాలని సూచించారు. అనంతరం మారెట్ ప్లాన్ మ్యాప్‌ను మంత్రి పరిశీలించారు. మారెట్ ప్రాంగణంలో పారింగ్‌కు ఇబ్బందులు ఉండొద్దన్నారు. పల్లెప్రకృతి వనం ఖమ్మం జిల్లాకు ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బృహత్ పల్లెప్రకృతి వనం పనులను బుధవారం ఆయన ఆకస్మికంగా



యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి మార్కెట్లను అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఖానాపురంలో రూ.4.50 కోట్లు, వీడీవోస్ కాలనీలో రూ.4.50 కోట్లతో మార్కెట్ల పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఒక్కో మార్కెట్ 2.01 ఎకరాల్లో నిర్మిస్తున్నామన్నారు. మారెట్‌కు వచ్చే వారికి ట్రాఫిక్ అడ్డంకులు లేకుండా చూడాలని మున్సిపల్ అధికారులను మార్కెట్ల ప్రాంగణంలో గ్రీనరీకి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రైతులు, వ్యాపారులు, వినియోగదారుల కోసం తాగునీటి వసతి, కూర్చోడానికి బల్లాలు ఏర్పాటు చేయాలన్నారు. వారి వెంట సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, టీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు తదితరులు ఉన్నారు.

ఇల్లెందు ప్రధాన రహదారికి ఆనుకొని రఘునాథపాలెంలో పదెకరాల సువిశాల ప్రాంగణంలో నిర్మించే మండల బృహత్ పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని, పల్లెప్రకృతి వనంలో ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్క్, జిమ్ పరికరాలు ఏర్పాటు చేయాలని జడ్పీ సీఈవోను ఆదేశించారు. సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ లక్ష్మీప్రసన్న, మేయర్ నీరజ, డీఎల్‌పీవో ప్రభాకర్‌రావు, ఎంపీడీవో రామకృష్ణ, టీఆర్ఎస్ నాయకులు కుర్రా భాస్కర్‌రావు, గుడిపుడి రామారావు, మందడపు నర్సింహారావు, గ్రామ కార్యదర్శి ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దళితబంధు తుది జాబితాను సిద్ధం చేయాలి



నిజామాబాద్, ఫిబ్రవరి 3: దళితబంధు పథకాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు యూనిట్ల తుది జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రగతిభవన్‌లో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అనువైన యూనిట్ల గుర్తింపు కోసం ఇప్పటికే వివిధ రంగాల్లో స్థిరపడిన వ్యాపారులను సమావేశానికి ఆహ్వానించి వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. సిమెంట్ ఇటుకల తయారీ, మొబైల్ స్పేర్స్, ఇంటర్నెట్ కేఫ్, జిరాక్స్, డీటీపీ సెంటర్, ఫ్లోర్‌మిల్స్, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పర్యావరాణ హితంగా నిలిచే బ్యాగుల తయారీ, పశువుల పెంపకం, డెయిరీ యూనిట్లకు సంబంధించి వివరాలను వ్యాపారులు వివరించారు. దళితుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా దళితబంధు పథకం అమలు చేస్తున్నదని కలెక్టర్ అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, చిత్రామిశ్రా, ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఏపీలో కొత్తగా 4,605 కరోనా కేసులు..

అమరావతి, ఫిబ్రవరి 3: ఆంధ్రప్రదేశ్‌లో 24 గంటల్లో 30,578 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా కొత్తగా 4,605 మందికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. 10మంది కరోనా బాధితులు మృతి చెందారు. రాష్ట్రవ్యాప్తంగా 11,729 మంది కోలుకున్నారని ఏపీ వైద్య ఆరోగ్యాధికారులు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 93,488 యాక్టివ్ కేసులున్నాయని వివరించారు. తూర్పుగోదావరిలో జిల్లాలో 642 , పశ్చిమ గోదావరి జిల్లాలో 539 , గుంటూరు జిల్లాలో 524, నెల్లూరు జిల్లాలో 501 అత్యధికంగా కేసులు నమోదయ్యాయని వివరించారు.

# కర్నూలులో పత్తి ధర ఆల్ టైమ్ రికార్డు..

అమరావతి, ఫిబ్రవరి 3:: కర్నూలు జిల్లాలో పత్తి ధరలు ఆల్ టైమ్ రికార్డుకు చేరుకున్నాయి. రాయలసీమ జిల్లాలతో పాటు యూ-బళ్లారి, రాయచోటి వంటి ఏడు జిల్లాలకు ప్రధాన కేంద్రమైన ఆదోని పత్తి మార్కెట్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా పత్తి ధరలు పెరిగాయి. ఒక్క క్వింటాకు పత్తి ధర రూ. 10,759 పలికింది. సీజన్ ముగియడంతోపాటు సరఫరా తగ్గడం, డిమాండ్ పెరగడం వల్ల వ్యాపారుల మధ్య పోటీతో పత్తి ధరలు పెరిగాయి. పత్తి ధర పెరగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఈ సీజన్‌లో పత్తి దిగుబడి బాగా తగ్గడంతో అంతర్జాతీయంగా డిమాండ్ ఏర్పడి పత్తి ధరలు పెరిగి ఆదోని మార్కెట్‌లో రికార్డు స్థాయికి చేరాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తికి మంచి డిమాండ్ ఉండడంతో వ్యాపారులు పత్తిని అధిక ధరకు కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చారు.

# వేములవాడ రూరల్ మండలం ఎమ్మెల్యే రమేశ్ బాబు జన్మదిన వేడుకలు



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 3:(నేటినిజం ప్రతినిధి):వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల గ్రామవేంకటేశ్వరుని ఆలయం ఆవరణములో ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు 65 వజన్మదిన వేడుకలు టీఆర్ఎస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు ముందుగా కేక్ కట్ చేసి అందరికి పంపిణీ చేశారు

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు సింగిల్ విండో చైర్మన్ ఏనుగు తిరుపతి రెడ్డి సర్పంచులుఎ శ తిరుపతి జైపాల్ రెడ్డి పెండ్యాల తిరుపతి ఎంపీటీసీ నర్సవ్వ బాల్ రెడ్డి టీఆర్ఎస్ పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు గోస్కుల రవి , డైరెక్టర్ అంజనికుమార్ బీసీ సెల్ రూరల్ మండలం అధ్యక్షుడు సోమినేని బాలు నాయకులు పెండ్యాల శంకర్ ఈర్యానాయక్ నరేష్ యామ తిరుపతి మైసయ్య ,టీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా జననేత ఎమ్మెల్యే రమేశ్ బాబు జన్మదిన వేడుకలు

## -రాజన్న ఆలయంలో పూజలు చేసి కొడెమొక్కు చెల్లించిన టిఆర్ఎస్ నాయకులు





రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 3:(నేటినిజం ప్రతినిధి):నిత్యం ప్రజా సేవకే పరితపించే నాయకుడు కష్టకాలంలో ప్రజల కష్టాలు తెలుసుకుని వారికి అండగా నిలబడే మనోధైర్యం నింపే నిస్వార్థ సేవకుడు, జననేతగా పేరుతెచ్చుకున్న వేములవాడ శాసనసభ్యులు డాక్టర్ చెన్నమనేని రమేష్ బాబు జన్మదిన సందర్భంగా టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పుల్కం రాజు ఆధ్వర్యంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం లో వారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు చేసి కోడె మొక్కు ను చెల్లించిన అనంతరం గుడిలోని దర్గాలో చాదర్ సమర్పించిన వారిలో మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు× పాలకవర్గ సభ్యులు కో ఆప్షన్ సభ్యులు టీఆర్ఎస్ నాయకులు టెంపుల్ ఎదురుగా కేక్ కట్ చేసి తిప్పాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ రామ తీర్థపు మాధవిరాజు , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగు మనోహర్ రెడ్డి,టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పుల్కం రాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే రమేశ్ బాబు ఆయురారోగ్య అశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని వేములవాడ నియోజకవర్గ ప్రజలుకోరుకుంటున్నారు.ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా రాజన్నను వేడుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు బింగి మహేష్ , ఇప్ప పుల్లాఅజయ్ నరాల శేఖర్,యచమినేని శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యులు సర్వర్ బాబు న్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లుఫీర్ మహమ్మద్ నాయకులు, పొలసనరేందర్ ,భాస్కర్ రావు , రా పెల్లి శ్రీధర్ ,గూడూరి మధు , కుమ్మరి శ్రీనివాస , ఫ్రెంట బాబు ,శ్రీకాంత్ గౌడ్ , సయ్యద్ గౌస్ బాబా, కమలాకర్ రెడ్డి, భాస్కర్ రావు ,ఇబ్రహీం, రహిల్ ,నాయకులు అభిమానులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాన్సర్ అవగాహనా 2కే రన్

## -క్యాన్సర్ పై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి.



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 3:(నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణం బైపాస్ రోడ్ లో యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ డే ను పురస్కరించుకొని యువకులతో 2కే రన్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా యువ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కానిస్టేబుల్ గొడిశెల రాజశేఖర్ మాట్లాడుతూ క్యాన్సర్ గురించి అవగాహన పెంపొందించడానికి, దాని నివారణ, గుర్తింపును, చికిత్సను ప్రోత్సహించేందుకు ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి 4 వ తేదీన ప్రపంచ క్యాన్సర్ రోజుగా గుర్తిస్తారని, సాధారణంగా మన శరీరంలో కణ విభజనలు ఒక క్రమ పద్ధతిలో నియంత్రించబడతాయి. కొన్ని సందర్భాలలో కణాల పెరుగుదలలో నియంత్రణ లేనందువల్ల కణాలు చాలా వేగంగా అస్తవ్యస్తంగా విభజన చెంది కణ సమూహాలను ఏర్పరుస్తాయి. ఈ కణసమూహాలను 'కంతి' ( ట్యూమర్) అంటారు, అటువంటి కొన్ని ప్రమాదకరమైన వాటిని క్యాన్సర్ అని వ్యవహరిస్తారు అని ముందుగా గుర్తించి చికిత్స అందించడం ద్వారా నయంచేయొచ్చని డబ్ల్యూహెచ్‌వో వెల్లడించింది అని, చెడు అలవాట్లు సిగరెట్, గుట్కా, పాన్ , మత్తు పదార్థాల వంటి వాటికీ దూరం గా ఉండాలి అనిప్రతీ ఒక్కరు కాన్సర్ మీద అవగాహన కలిగి ఉండాలి అని తెలిపారు. ఈ కార్యక్రమం లో యువ ఫౌండేషన్ అభ్యర్థులు పాల్గొన్నారు.

# కరోనా తో మృతి



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 3:(నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం లింగంపేట గ్రామానికి చెందిన ఈగ రాజలింగం (55) అనే వ్యక్తి కరోనా తో బుధవారం రాత్రి సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందినారు. రాజలింగం వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. చందుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో కరోనా పరీక్ష చేయించుకోగా నెగిటివ్ రిపోర్ట్ వచ్చింది. పరిస్థితి విషమంగా మారడంతో సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించగా సిటీ స్కాన్ లో కరోనా ఉందని తేలింది. రాజలింగం కు గుండె జబ్బు తో పాటు. శ్వాస కోశా వ్యాధి ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందిన రాజలింగం కు కరోనా నిబంధనలతో అంత్యక్రియలు నిర్వహించారు. రాజలింగం కు భార్య రాజవ్వ. కుమారులు ప్రశాంత్. ప్రతాప్ ప్రవీణ్ ఉన్నారు,

# 270 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

జహీరాబాద్ ఫిబ్రవరి 3 : అక్రమంగా తరలిస్తున్న 270 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. చిరాక్ పల్లి ఎస్ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం సాయంత్రం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని చిరాక్ పల్లి శివారులో 65వ జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా..హైదరాబాద్ నుంచి గుజరాత్‌కు లారీలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా 270 కింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.లారీ డ్రైవర్ ఉత్తరప్రదేశ్‌లోని రాజాపూర్ కు చెందిన అఖిలేష్ యాదవ్‌గా గుర్తించామని పేర్కొన్నారు.


Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com